విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందిరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :177 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 12 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



మేధో సంపత్తి వివాదాలకు ఆ హైకోర్టే శరణ్యం అనుకోవడం భ్రమ

- 'ఫోరమ్ షాపింగ్'పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఫోరమ్ షాపింగ్ లేదా లిటిగేషన్ టూరిజం పోకడలపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం
- కర్ణాటక, తమిళనాడుకు చెందిన సంస్థల వివాదాన్ని ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేయడంపై ఆక్షేపణ
- సంబంధిత ఐపీ దావాను ఢిల్లీ నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసిన సుప్రీం ధర్మాసనం
- హైకోర్టుల మధ్య ఎలాంటి అంతరాలు, క్రమానుగత వ్యత్యాసాలు ఉండవని స్పష్టీకరణ



కుల్గామ్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి

- ముగ్గురు జవాన్లకు గాయాలు!
- చెక్‌పోస్టు వద్ద మోటార్‌సైకిల్‌పై వచ్చి కాల్పులు.. ఇద్దరి పరిస్థితి విషమం!

ఎత్తిపోతల పథకాలకు జలహారతి



- 789 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు రూ.632 కోట్లకు పైగా నిధులు
- ఖరీఫ్ ప్రారంభానికి ముందే మరమ్మతులు పూర్తి చేయాలి
- 36 సాగునీటి ప్రాజెక్టులకు రెండున్నరేళ్ల గడువు
- జలహారతి కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు
- 4,171 ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు.. 903.1 మెగావాట్ల ఉత్పత్తికి ప్రణాళిక

అమరావతి:

రాష్ట్రంలో సాగునీటి వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలకు తిరిగి జీవం పోసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పనిచేయకుండా నిలిచిపోయిన 789 ఎత్తిపోతల పథకాలన్నింటినీ పునరుద్ధరించి, వచ్చే జూన్ నాటికి వాటి ద్వారా నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోగా మరమ్మతులన్నీ పూర్తి వివరాలు 2లో..



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి ఆరు జాతీయ అవార్డులు!

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాల స్వీకరణ
- ఐదు నగరపాలక సంస్థలు, కుప్పం మున్సిపాలిటీకి గుర్తింపు
- స్వచ్ఛ్ షెహర్ జోడీ విభాగంలో తిరుపతి--కుప్పంకు మూడో స్థానం
- నేషనల్ క్లీన్ సిటీ విభాగంలో విజయవాడకు మూడో ర్యాంకు
- గుంటూరుకూ జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు

అమరావతి

పట్టణ పారిశుద్ధ్య నిర్వహణలో ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025--26 అవార్డుల్లో రాష్ట్రం ఆరు పురస్కారాలను సాధించింది. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్ వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన నగరాలు, పట్టణాలకు ఈ అవార్డులు దక్కాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర' కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్మికుల కృషి, అధికారుల పర్యవేక్షణ ఈ గుర్తింపునకు దోహదపడ్డాయని ప్రభుత్వం పేర్కొంది. దేశ రాజధాని దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల వివరాలు 2లో..




రైతులకు కేంద్రం భారీ ఊరట..

- రూ.62,370 కోట్ల ఎరువుల సబ్సిడీకి ఆమోదం!
- రబీ 2026-27 సీజన్‌కు భారీగా నిధుల కేటాయింపు..
- డీఏపీ బస్తా ధర రూ.1,350గానే కొనసాగింపు!
- ముద్రా రుణాలకు మరో ఐదేళ్ల పొడిగింపు..
- స్టాండప్ ఇండియా పథకానికీ గ్రీన్ సిగ్నల్!
- యుగే యుగీన్ మ్యూజియానికి రూ.3,230 కోట్లు..
- నోయిడా మెట్రో విస్తరణకు రూ.2,390 కోట్లు!

రామమందిర విరాళాల లెక్కలు బయటపెట్టాలి

- విరాళాల సేకరణ నుంచి లెక్కింపు వరకు అవకతవకల ఆరోపణలు..
- సమగ్ర దర్యాప్తునకు జైరాం రమేశ్ డిమాండ్!
- 2021లోనే అక్రమాలపై ఫిర్యాదు చేశారంటూ ప్రస్తావన..
- ఫిర్యాదు చేసిన అధికారినే తొలగించారని ఆరోపణ!
- ఎస్ఐటీ నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదు?
- మోదీ, యోగి ప్రభుత్వాలపై కాంగ్రెస్ నేత ప్రశ్నలు!





విదేశీయులకు వీసా విధానంలో భారీ మార్పులు

- 13 కేటగిరీలు 9కి కుదింపు!
- ఉప విభాగాలు 49 నుంచి 23కి తగ్గింపు..
- దరఖాస్తు ఫారాల్లో 70 శాతం వరకు ఫీల్డ్స్ తొలగింపు!
- వీసా ప్రక్రియను సరళతరం చేసిన కేంద్ర హోం శాఖ..
- విదేశీ సందర్శకులకు మరింత సులభంగా అనుమతులు!

ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల నగారా!



- నేడు మధ్యాహ్నం 12.30 గంటలకు షెడ్యూల్ విడుదల
- న్యాయపరమైన చిక్కులు తొలగడంతో ఎన్నికలకు మార్గం సుగమం
- నాలుగు నగరపాలక సంస్థలు.. 19 మున్సిపాలిటీలకు ఎన్నికలు
- ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటన

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది. న్యాయపరమైన చిక్కులు, వివాదాలు తొలగిపోవడంతో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. గురువారం (నవంబర్ 12) మధ్యాహ్నం 12.30 గంటలకు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా మీడియా సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నారు. రాష్ట్రంలో ఇటీవల 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించారు. అయితే వివిధ కారణాలతో 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి--తాడేపల్లి నగరపాలక సంస్థలతో పాటు మరో 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. ఆయా సంస్థలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రిజర్వేషన్లను ఖరారు చేసింది. వార్డుల వారీగా కేటాయింపులు కూడా ప్రకటించింది.

ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం!



- 'పరివర్తన రాజనీతి పార్టీ'ని ప్రకటించిన విజయసాయిరెడ్డి
- 'దేశం కోసం.. ధర్మం కోసం' నినాదంతో పీఆర్‌పీ ఏర్పాటు
- కాషాయం, తెలుపు రంగులతో పార్టీ జెండా ఆవిష్కరణ
- వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలని పిలుపు
- యువతలో నాయకత్వ లక్షణాలను ప్రోత్సహిస్తామని వెల్లడి
- సీఎం కావాలనే ఆశ లేదని.. యువత నుంచే సీఎం అభ్యర్థి ఎంపిక చేస్తానని ప్రకటన



అయోధ్యలో అద్భుత రామ్ దర్బార్

- 220 టన్నుల ఇసుకతో ప్రపంచ రికార్డు!
- 58 అడుగుల పొడవు.. 20 అడుగుల ఎత్తుతో భారీ సైకత శిల్పం!
- ఏడు రోజుల పాటు శ్రమించిన కళాకారుడు మధురేంద్ర కుమార్ బృందం..
- బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు!
- సరయూ తీరంలో కనువిందు చేస్తున్న రామమందిర నమూనా..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీ నగరాల హవా.. విశాఖకు అగ్రతాంబూలం

- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 ర్యాంకింగ్స్
- 10 లక్షల జనాభా కేటగిరీలో గ్రేటర్ విశాఖకు మొదటి స్థానం
- దేశంలోనే 3వ అత్యంత స్వచ్ఛమైన నగరంగా విజయవాడ
- 3 నుంచి 10 లక్షల జనాభా విభాగంలో గుంటూరుకు 3వ ర్యాంకు
- దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా నవీ ముంబై ఎంపిక



ఎత్తిపోతల పథకాలకు జలహారతి..

-మొదటిపేజీ తరువాయి

చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రాధాన్యంగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టులను వచ్చే రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కొరత రానివ్వబోమని, పనుల్లో జాప్యం జరగకుండా నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ, నిర్వహణ, సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై చర్చించారు.

789 ఎత్తిపోతల పథకాలకు పునరుజ్జీవం

రాష్ట్రంలో నిలిచిపోయిన 789 ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించేందుకు సుమారు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ పథకాలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 7.49 లక్షల ఎకరాలకు సాగునీటి సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. మరమ్మతులకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. అంచనాలు సిద్ధమైన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

జలహారతి కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగం

ఎత్తిపోతల పథకాల నిర్వహణకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థ ఉండాలని చంద్రబాబు సూచించారు. జలహారతి కార్పొరేషన్ ద్వారా ఈ పథకాల పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరాన్ని బట్టి ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. పథకాల పనితీరు, నిర్వహణ, మరమ్మతులపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

36 ప్రాజెక్టులకు రెండున్నరేళ్ల గడువు

రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యంగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే రెండున్నరేళ్లలో వాటిని పూర్తి చేసేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టుల వారీగా పనుల పురోగతి, అవసరమైన నిధులు,



ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోకుండా అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుస్తామని స్పష్టం చేశారు.

4,171 ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు

జలవనరుల శాఖ పరిధిలో అందుబాటులో ఉన్న భూములను సౌర విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకునే అవకాశాలపైనా సమావేశంలో చర్చించారు. శాఖ పరిధిలో మొత్తం 5,565 ఎకరాల భూమి ఉండగా, అందులో 4,061 ఎకరాలను సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ భూముల ద్వారా 877.3 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోని 84 ప్రాంతాల్లో 110 ఎకరాలను సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించవచ్చని గుర్తించారు. వీటి ద్వారా మరో 25.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా 4,171 ఎకరాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేస్తే 903.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని అధికారులు వెల్లడించారు.

కాలువలపైనా సౌర, జల విద్యుత్ ఉత్పత్తి


శాఖ భూములతో పాటు కాలువలపై కూడా సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను పరిశీలించాలని చంద్రబాబు సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అవసరానికి మించి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసి ఆదాయం పొందే అవకాశాలను అధ్యయనం చేయాలని తెలిపారు. రవాణా, విద్యుత్ ఉత్పత్తి, సౌర విద్యుత్, వ్యవసాయ రంగాలను సమన్వయం చేయడం ద్వారా అదనపు ఆదాయ వనరులను సృష్టించవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

జలవనరుల వినియోగానికి సంబంధించి కూడా నియంత్రణ వ్యవస్థ అవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. విద్యుత్ రంగంలో ఉన్న రెగ్యులేటరీ కమిషన్ తరహాలో వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల్లో మాదిరిగా సాగునీటి రంగంలోనూ ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ ఉంటే నీటి వినియోగాన్ని సమర్థంగా నిర్వహించవచ్చని తెలిపారు. గంగా--కావేరి నదుల అనుసంధానం వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా రవాణా, విద్యుత్, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు ప్రయోజనం కలిగే అవకాశాలున్నాయని వివరించారు. వివిధ రంగాల అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగంపై నిర్ణయాలు తీసుకునే విధంగా వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ప్రతిపాదనను అధ్యయనం చేయాలని చంద్రబాబు అధికారులను

ముందున్న మొసళ్ల పండుగ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై కూటమి ఎంతో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అధిక స్థానాల్లో కూటమి విజయం సాధించినప్పటికీ ముందున్న సవాళ్లు మరియు క్షేత్రస్థాయి బాధ్యతలు మరింత పెద్దవని చెప్పవచ్చు. ఎన్నికల్లో గెలవడం ఒక ఎత్తయితే, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మరో ఎత్తు. అలాగే రానున్న రెండున్నరేళ్ల సమయం అత్యంత కీలకం. చివరి ఏడాది ఎన్నికల ఏడాది. ఇక మిగిలింది ఏడాదిన్నర మాత్రమే. ఈ ఏడాదిన్నర మాత్రమే కూటమి ప్రభుత్వానికి సమయం ఉంది. ఈ ఏడాదిన్నర కాలం కూటమికి కీలకమనే చెప్పాలి. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో కూటమి విజయం సాధించినప్పటికీ పోలింగ్ శాతం పెరగకపోవడం ఆందోళన కలిగించే అంశమే. అందుకే రానున్న రెండున్నరేళ్లు కూటమి ప్రభుత్వం అనేక అంశాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జాగ్రత్తపడకపోతే అంతే హామీల అమలు... సూపర్ సిక్స్ హామీల అమలు పెద్ద టాస్క్ అని చెప్పాలి. కూటమి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన 'సూపర్ సిక్స్' పథకాలను పూర్తి స్థాయిలో, నిరంతరాయంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం పెద్ద సవాల్. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక లోటును అధిగమిస్తూ, ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు అభివృద్ధి పనులను సమన్వయం చేసుకోవడం కత్తిమీద సాము లాంటిది. స్థానిక సంస్థలలో గెలిచినంత మాత్రాన సరిపోదు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు తగిన నిధులు కేటాయించి, గ్రామ మరియువార్డు స్థాయిల్లో మౌలిక వసతుల రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కొత్త పరిశ్రమలను ఆకర్షించడం, ఐటీ రంగ అభివృద్ధి మరియు ఉద్యోగ నియామకాలు వేగవంతం చేయాలి. కేవలం ఎన్నికల విజయాల సంబరాలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పాలనను ఎంత సమర్థవంతంగా అందిస్తారనే దానిపైనే కూటమి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. 2019 ఎన్నికలలోనూ చంద్రబాబు తాను చేసిన అభివృద్ధి, సంక్షేమం ఒడ్డును పడేస్తుందని గట్టిగా భావించారు. కానీ బొమ్మ తిరగబడిందన్న విషయం గుర్తుంచుకోవాలి. ప్రతిపక్ష వైసీపీ బలం ఏ మాత్రం తగ్గలేదన్నది కూడా సుస్పష్టం. అలాగే 2024 ఎన్నికలకు ముందు జగన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను చూసి మురిసిపోయారు. కానీ ఆ రోజు ఎన్నికల్లో ప్రజలు దిమ్మతిరిగే తీర్పు ఇచ్చారు. పదకొండు సీట్లకే పరిమితం చేశారు. చేసిన మంచి పనులు చెప్పుకోవడం మంచిదే అయినా..ప్రజలు కేవలం వాటిని చూసే గెలిపిస్తారని అనుకోవడం మాత్రం ఊహాజనితమే. గత కొన్ని ఎన్నికల నుంచి ప్రజలు అదేరకమైన తీర్పు చెబుతూ వస్తున్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను చెప్పుకోవడంతో పాటు తమ ప్రభుత్వంలో ఉన్న లోటు పాట్లను కూడా సరిదిద్దుకోవాల్సి ఉంటుంది. ఎమ్మెల్యేలపై అసంతృప్తి, అవినీతి వంటివి సాధారణ ఎన్నికల్లో బలంగా పనిచేస్తాయని చెప్పక తప్పదు. మరొకవైపు ప్రజల కొనుగోలు శక్తి కూడా పెరగాల్సి ఉంటుంది. కేవలం పింఛన్లు పంపిణీ చేశామని చెప్పుకుంటే సరిపోదు. వారికి ఎప్పటికప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటేనే కూటమి పక్షాన నిలబడతారు.



లేకుంటే పడిపోతారు.

రాజానగరంలో సెటైర్లు

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీల హవా కనిపించినప్పటికీ, తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం నియోజకవర్గం మాత్రం భిన్నమైన ఫలితాలను నమోదు చేసింది. ముఖ్యంగా జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కుటుంబానికి ఈ ఎన్నికలు ఊహించని షాక్ ఇచ్చాయి. ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి సీతానగరం జెడ్పీటీసీ స్థానంలో ఓటమి చెందడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. వైసీపీ అభ్యర్థి కరుటూరి శ్రీహరి బాబు) ఏకంగా 2,607 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం జనసేన వర్గాలను నిరాశకు గురిచేసింది.రాష్ట్రవ్యాప్తంగా కూటమి అనుకూల ఫలితాలు వస్తున్న సమయంలో రాజానగరంలో మాత్రం వైసీపీ మంచి ఆధిపత్యాన్ని ప్రదర్శించడం ఆసక్తికరంగా మారింది. ఈ ఫలితాలు స్థానిక రాజకీయ సమీకరణాలపై కొత్త చర్చకు తెరలేపాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే సొంత కుటుంబానికి చెందిన అభ్యర్థి ఓటమి చెందడంతో ఆయన రాజకీయ బలంపై ప్రత్యర్థులు ప్రశ్నలు సంధిస్తున్నారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని మరోసారి సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.ఈ ఎన్నికల ఫలితాలు ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో బత్తుల బలరామకృష్ణ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ వైసీపీ అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని పులివెందులలో ఓడిస్తామంటూ గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలకు ఇప్పుడు స్థానిక ఎన్నికల ఫలితాలను జోడించి సెటైర్లు వేస్తున్నారు. సొంత నియోజకవర్గంలోనే కుటుంబ సభ్యురాలిని గెలిపించుకోలేకపోయిన నాయకుడు పులివెందుల గురించి మాట్లాడటం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విమర్శలు జనసేన శ్రేణులకు ఇబ్బందికరంగా మారాయి.మరోవైపు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అనుచరులు మాత్రం ఈ విజయాలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో నాయకులను కలుపుకొని వెళ్లడం వల్లే మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. జక్కంపూడి రాజా నాయకత్వం మరోసారి తన ప్రభావాన్ని నిరూపించుకుందని అభిమానులు ప్రచారం చేస్తున్నారు. ఆయనను ఎదుర్కొన్న తర్వాతే ఇతర రాజకీయ ప్రత్యర్థుల గురించి మాట్లాడాలంటూ జనసేన ఎమ్మెల్యేకు సవాళ్లు విసురుతున్నారు.సీతానగరం, కోరుకొండ ప్రాంతాల్లోనూ వైసీపీ సాధించిన విజయాలను ఆ పార్టీ శ్రేణులు ప్రస్తావిస్తున్నాయి. సీతానగరంలో మొత్తం 21 ఎంపీటీసీ స్థానాలకు 18 స్థానాలను, కోరుకొండలో 23 స్థానాలకు 12 స్థానాలను కైవసం చేసుకున్నట్లు వైసీపీ అభిమానులు పేర్కొంటున్నారు. ఈ ఫలితాలను తమ నాయకత్వానికి, కేడర్ ఐక్యతకు నిదర్శనంగా చూపిస్తున్నారు. రాజానగరంలో వచ్చిన ఫలితాలు కేవలం ఒక స్థానానికి పరిమితం కాకుండా నియోజకవర్గ రాజకీయాల్లో మార్పునకు సంకేతమని వారు విశ్లేషిస్తున్నారు.అయితే, ఈ విజయాల వెనుక స్థానిక సమస్యలు, నాయకుల పనితీరు, పార్టీ కేడర్ మధ్య సమన్వయం వంటి అంశాలు కీలకంగా పనిచేసి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తన నియోజకవర్గంలో పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందనే చర్చ మొదలైంది. ముఖ్యంగా జనసేన నాయకత్వం క్షేత్రస్థాయిలో ప్రజలతో మరింత మమేకం కావాలని ఈ ఫలితాలు సూచిస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు.మొత్తానికి రాజానగరం స్థానిక ఎన్నికల ఫలితాలు కూటమి, వైసీపీ మధ్య రాజకీయ పోరును మరోసారి తెరపైకి తీసుకొచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా కూటమికి అనుకూల పవనాలు వీచినప్పటికీ, రాజానగరంలో వైసీపీ సాధించిన విజయాలు ఆ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. రాబోయే రోజుల్లో ఈ ఫలితాల ప్రభావం నియోజకవర్గ రాజకీయాలపై ఎంతవరకు ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి ఆరు జాతీయ అవార్డులు!

-మొదటిపేజీ తరువాయి

ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పురపాలక శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ అవార్డులను స్వీకరించారు.

ఐదు కార్పొరేషన్లు.. కుప్పం మున్సిపాలిటీ

రాష్ట్రంలోని ఐదు నగరపాలక సంస్థలతో పాటు ఒక మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి నగరపాలక సంస్థలు అవార్డులు సాధించగా, చిత్తూరు జిల్లాలోని కుప్పం మున్సిపాలిటీ కూడా పురస్కారాన్ని దక్కించుకుంది.

తిరుపతి--కుప్పం జోడీకి మూడో ర్యాంకు

స్వచ్ఛ్ షెహర్ జోడీ విభాగంలో తిరుపతి--కుప్పం జంట దేశవ్యాప్తంగా మూడో ర్యాంకును సాధించింది. ఈ విభాగంలో తిరుపతి మెంటార్ సిటీగా, కుప్పం మెంటీ సిటీగా ఎంపికయ్యాయి. పట్టణాల మధ్య పరస్పర సహకారం, పారిశుద్ధ్య నిర్వహణలో అనుభవాల మార్పిడి వంటి అంశాలకు ఈ విభాగంలో ప్రాధాన్యం ఉంటుంది.

విజయవాడ, గుంటూరుకు ప్రత్యేక గుర్తింపు

నేషనల్ క్లీన్ సిటీ విభాగంలో విజయవాడ నగరపాలక సంస్థ మూడో ర్యాంకుకు ఎంపికైంది. 3 నుంచి 10 లక్షల జనాభా కలిగిన నగరాల విభాగంలో గుంటూరు మూడో ర్యాంకును సాధించింది. ఇక రాష్ట్రంలో తొలి స్వచ్ఛ్ సిటీగా రాజమహేంద్రవరం గుర్తింపు పొందింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు నగరాలు, పట్టణాల పారిశుద్ధ్య నిర్వహణకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి.

కార్మికుల శ్రమతోనే గుర్తింపు: మంత్రి నారాయణ

'స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర' సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వల్లే ఆరు అవార్డులు సాధ్యమయ్యాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల నిరంతర శ్రమ, అధికారుల పర్యవేక్షణతోనే ఈ గుర్తింపు లభించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే స్వచ్ఛతా కార్యక్రమాల్లో అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని తెలిపారు.

ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం!

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త పార్టీ ఆవిర్భవించింది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్‌పీ)ని ప్రకటించారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పేరుతో పాటు జెండాను ఆవిష్కరించారు. కాషాయం, తెలుపు రంగుల మధ్యలో అశోకచక్రం ఉండేలా పార్టీ జెండాను రూపొందించారు. 'దేశం కోసం.. ధర్మం కోసం' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు విజయసాయిరెడ్డి వెల్లడించారు.

ప్రజల చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు

పార్టీ ఆవిర్భావ కార్యక్రమం అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఏ ఒక్క నాయకుడి వల్లనో రాష్ట్రం, దేశం మారిపోవని అన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఏ ఒక్క నాయకుడి చేతుల్లోనూ లేదని, ప్రజల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. ఓటు వేసినంత మాత్రాన ప్రజల బాధ్యత ముగిసిపోదని చెప్పారు. ప్రభుత్వాలు ఏవైనా తాము చేసిన మంచి పనులనే ప్రచారం చేసుకుంటాయని, అయితే మంచి పని ఎవరు చేసినా అభినందించాలని సూచించారు. తప్పు ఎవరు చేసినా ఆధారాలతో ప్రశ్నించాలని, ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కు అని వ్యాఖ్యానించారు.

యువతే పార్టీకి ప్రధాన బలం

తాను మరో నాయకుడిని తయారు చేయడానికి పార్టీ పెట్టలేదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. యువతలో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను వెలికితీసి, వారిని నాయకులుగా తీర్చిదిద్దడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. ప్రతి సామాజిక వర్గం నుంచి నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి కావాలనే ఆశ తనకు లేదని, యువతలోనే సీఎం అభ్యర్థిని ఎంపిక చేస్తానని ప్రకటించారు.

కుటుంబ రాజకీయాలపై విమర్శలు

రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజలను రెండు కుటుంబాలే శాసిస్తున్నాయని విజయసాయిరెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కొద్దిమంది కుటుంబాల ఆధిపత్యమే కొనసాగాలా అని ప్రశ్నించారు. వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త తరానికి రాజకీయాల్లో అవకాశాలు కల్పించడమే తమ పార్టీ ఉద్దేశమని వివరించారు.

ఆధారాలతో ప్రశ్నించాలి

ప్రభుత్వాలు చేసే పనులను ప్రజలు నిశితంగా పరిశీలించాలని విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. మంచి పనులను అభినందిస్తూనే, తప్పులను ఆధారాలతో ప్రశ్నించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం, యువత నాయకత్వం, సామాజిక వర్గాల ప్రాతినిధ్యమే లక్ష్యాలుగా పరివర్తన రాజనీతి పార్టీ పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. రాజకీయాల్లో కొత్త ప్రత్యామ్నాయంగా ఎదగడమే లక్ష్యంగా పీఆర్‌పీ ఆవిర్భవించినట్లు విజయసాయిరెడ్డి ప్రకటించారు. పార్టీ విధానాలు, కార్యాచరణ, సంస్థాగత నిర్మాణంపై మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది.

బడి కోసం పోర్టల్ ద్వారా 10 కోట్ల నిధులు

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీలకు మౌలిక వసతుల కల్పించేందుకు దాతల నుంచి ప్రభుత్వం విరాళాలు సేకరిస్తోంది. 'బడి కోసం' పేరుతో పోర్టల్‌ను ప్రారంభించి దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు.



ఈ బడి కోసం పోర్టల్ ద్వారా విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది జులై 24న పోర్టల్‌ను ప్రారంభించగా.. ఇప్పటి వరకు దాతలు రూ.9.78 కోట్లు అందించారు. వస్తువులు, సివిల్ వర్క్స్ రూపంలో సాయం అందించారు.రాష్ట్రవ్యాప్తంగా 1,541 ప్రభుత్వ స్కూళ్లకు 1,679 మంది దాతలు విరాళాలు అందించారు.కొంతమంది దాతలు సర్కారు బడుల అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు తమ స్థాయికి తగ్గట్టు తక్కువ మొత్తంలో విరాళాలు అందిస్తున్నారు. ఈ విరాళాలలో అత్యధికంగా పల్నాడు జిల్లాకు రూ.89.36 లక్షలు, శ్రీకాకుళం జిల్లాకు రూ.73.28 లక్షలు, చిత్తూరుకు రూ.60.39 లక్షలు విరాళాల రూపంలో వచ్చాయి. రాష్ట్రంలో మొత్తం మీద 43,068 బడులకు పూర్తిస్థాయిలో అన్నిరకాల వసతులు కల్పించేందుకు రూ.6,320 కోట్లు అవసరమని అంచనా వేశారు. బడి కోసం పోర్టల్ ద్వారా ప్రతి స్కూల్‌కు అవసరమైన సామాగ్రి, సివిల్ వర్క్స్ వివరాలను అందుబాటులో ఉంచారు. అదనంగా తరగతి గది నిర్మించడానికి రూ.18.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు.స్కూల్‌లో తరగతి గది, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు దాతలు పూర్తిమొత్తం అందించాల్సి ఉంటుంది. విరాళాలు అందించే దాతలకు విద్యాశాఖ మంత్రి లోకేష్ సుంచి ప్రశంసాపత్రం అందుతుంది. ఈ విరాళాలు ఇవ్వాలనుకుంటున్న దాతలు ముందుగా పోర్టల్‌లో వ్యక్తిగత వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఒకవేళ దాతలు ఎవరైనా తరగతి గదులు, భవన నిర్మాణానికి పూర్తిగా నిధులిస్తే.. ఆ దాతల పేర్లను ఆయా గదులు, భవనాలకు పెడతారు. విద్యార్థులు కూర్చోవడానికి 11,080 డ్యుయల్ డెస్క్‌లు, 14,031 బడులకు గ్రీన్ చాక్‌పీస్ బోర్డులు అవసరమని అంచనా వేశారు.ఈ బడి కోసం పోర్టల్‌ను ప్రారంభించిన రోజే నెల్లూరు జిల్లాకు చెందిన ఓ పారిశ్రామికవేత్త రూ.4 కోట్లు విరాళంగా అందించారు. పోలవరం జెడ్పీ స్కూల్‌లో చదువుకుని.. ఆ దగ్గరలోనే జిరాక్స్ కేంద్రాన్ని నడుపుతున్న మరో వ్యక్తి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. సివిల్ వర్క్స్‌లో భాగంగా స్కూల్ గ్రౌండ్ అభివృద్ధి, తలుపులు, కిటికీలు, డెస్కులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, తరగతి గదుల నిర్మాణం వంటి అంశాలు కూడా ఉన్నాయంటున్నారు అధికారులు. మొత్తం మీద బడి కోసం పోర్టల్‌కు దాతల నుంచి మంచి స్పందన వస్తోంది. చాలామంది విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విరాళాలు వస్తాయని చెబుతున్నారు.

42వ వార్డు కౌన్సిలర్ బీబీకి మహిళల ఆధ్వర్యంలో ఘన సన్మానం



వసంతలక్ష్మి,నాగూర్ వహీదా,అశ్వర్థమ్మ, ఇందిర,గీతాంజలి నేతృత్వంలో అభినందన కార్యక్రమం

ధర్మవరం,నవంబర్ 11 (పెన్ సత్తా) ధర్మవరం మున్సిపాలిటీలోని 42వ వార్డు కౌన్సిలర్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన బీబీ ఎన్నికైన సందర్భంగా ఆమె నివాసంలో మహిళల ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వసంతలక్ష్మి,నాగూర్ వహీదా,అశ్వర్థమ్మ, ఇందిర,గీతాంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.ఈ సందర్భంగా మహిళలంతా కలిసి నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ బీబీకి ఘన స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందజేసి,శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ,

42వ వార్డు కౌన్సిలర్‌గా బీబీ ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ,వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మహిళలు,వృద్ధులు, పేదల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు.

తెలుగుదేశం పార్టీ తరఫున బీబీకి లభించిన ప్రజా మద్దతు పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ,ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని మహిళలు ఆకాంక్షించారు. మహిళల ఐక్యతను చాటుతూ వసంతలక్ష్మి,నాగూర్ వహీదా,అశ్వర్థమ్మ, ఇందిర,గీతాంజలి ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళలు మాత్రమే పాల్గొని నూతన కౌన్సిలర్ బీబీకి అభినందనలు తెలిపారు.

యువత మత్తు పదార్థాలు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

మెడికల్ ఆఫీసర్ డి.జయప్రకాష్



నక్కపల్లి, పెన్ సత్తా నవంబరు 11: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వైద్యాధికారి జయ ప్రకాష్ విద్యార్థులకు సూచించారు. మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాదకద్రవ్యాల నివారణ– బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ జయప్రకాష్, వైద్య విస్తరణాధికారి యు .వి. శ్రీనివాసరావు లు విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ నేటి యువత ముఖ్యంగా పాఠశాల కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలకు లోబడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, స్నేహితుల ఒత్తిడి ,సినిమాల ప్రభావంతో గుట్కా ,సిగరెట్, గంజాయి మద్యం వంటి వాటికి విచ్చలవిడిగా అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మొదట సరదాగా అనిపించినా తరువాత ప్రాణాంతకంగా మారుతాయని, దీనివల్ల కాలేయము, ఊపిరితిత్తులు, గుండె దెబ్బతింటాయని, జ్ఞాపక శక్తి నశిస్తుందని, మానసిక ఒత్తిడికి గురవుతారని ,దీనివలన అనేక ప్రమాదాలు కలుగుతాయని ఆయన తెలియజేశారు. ఒకసారి అలవాటు పడితే వదలడం చాలా కష్టమని ముఖ్యంగా బాలికలు ఎవరైనా మీకు తెలియని చాక్లెట్లు , మాత్రలు ఇస్తే తీసుకోవద్దని తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు వెంటనే చెప్పాలని ఆయన తెలియజేశారు .మంచి స్నేహం చేయాలని. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని వారు అన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను సిబ్బంది తెలియజేశారు .18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం చేయడం నేరమని బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం వివాహం చేసిన తల్లిదండ్రులకు చేసుకున్న వారికి రెండు సంవత్సరాల జైలు శిక్ష లక్ష రూపాయలు జరిమానాలు విధించబడుతుందని అన్నారు. బాల్యంలో వివాహం చేస్తే బాలిక శారీరకంగా, మానసికంగా ఎదగదని ,చిన్న వయస్సులోనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వారు తెలిపారు. ఉద్యోగం ,ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోతామని తమ కాళ్లపై తమ నిలబడలేక జీవితాంతం ఇతరులపై ఆధార పడవలసి వస్తుందని ఆయన విద్యార్థులతో మాట్లాడారు. చివరగా విద్యార్థులందరితో మేము మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ,బాల్య వివాహాలు అడ్డుకుంటామని, బాగా చదువుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్ .వి .ఎస్ .ఆచార్యులు వి. పద్మావతి ,అమ్మాజీ లతోపాటు వైద్య సిబ్బంది కె. రవికుమార్ ,స్థానిక ఏఎన్ఎం నాగమణి ,సత్యవతి, మహబూబ్ నిషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా సకురు కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు



చోడవరం, నవంబర్11 పెన్ సత్తా.... స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ఆధ్వర్యంలో టిడిపి యూత్ నాయకులు సకురు కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, ఎంపిపి అభ్యర్థి గూనూరు మల్లునాయుడు ముందుగా సకురు కోటేశ్వరరావు చేత కేకు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సాలువాలుతో సత్కరించారు. అనంతరం మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సిరిపురపు రమేష్, టిడిపి మహిళా సంఘం నాయకురాలు గూనూరు కనకమహాలక్ష్మి, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం అక్షయపాత్ర ట్రస్ట్ చైర్మన్ తాడి పనసారెడ్డి తదితరులు సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేకు తినిపించి అందరికీ స్వీట్లు కేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, ఎంపీటీసీ కందర్ప రమణమూర్తి, యూత్ నాయకులు నౌడు సుధాకర్, పార్థరాజు వర్మ, గర్ల్స్ హైస్కూల్ చైర్మన్ గుమ్మాల సత్తిబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, టౌన్ ప్రెసిడెంట్ యర్రంశెట్టి చిన్న, హార్డింజ్ రెస్ట్ హౌస్ చైర్మన్ ఈర్లే శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు టి.శ్రీను, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, బాలబోయిన దేముళ్ళు, మాజీ ఎంపీటీసీలు పట్నాల సంతోష్, చిన్న, కొత్త ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సకురు వీధిలో.... చోడవరంలోని సకురు వీధిలోని యువకులు సకురు కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సకురు ఇంటి వద్ద బహిరంగ ప్రదేశంలో యువకులు, ఆ ప్రాంతవాసులు సకురు కోటీశ్వరావు చేత కేకు కట్ చేసి అందరికీ స్వీట్లు కేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారీగా యువకులు పాల్గొన్నారు.

శివాలయం పుష్కరిణి అభివృద్ధికి రూ 50 వేలు చొప్పున ఇద్దరు విరాళం



చోడవరం, నవంబర్11 పెన్ సత్తా.... స్థానిక స్వయంభూ శ్రీగౌరీశ్వర స్వామి ఆలయం వద్ద పుష్కరిణి అభివృద్ధి పనులు రూ 2 కోట్లుతో జరుగుతున్నాయి. పుష్కరిణి అభివృద్ధికి సాంబశివుని భక్తులు పుష్కలంగా విరాళాలు అందజేస్తున్నారు. చోడవరంనకు చెందిన జామి సోమశేఖర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ 55 వేల 555 లు అందజేయగా, విజయనగరంనకు చెందిన వెంకట శోభన చలపతిరావు భారతి దంపతులు రూ 50 వేల ఒక రూపాయి విరాళంగా ఆలయం ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి, చైర్మన్ గూనూరు సురేష్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో కెవి ఆశా కిరణ్మయి, శంకర్, శ్రీనురాజు, వైసిపి నాయకులు ఓరుగంటి నెహ్రూబాబు, ఆర్డింజ్ రెస్ట్ హౌస్ చైర్మన్ ఈర్లే శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు మాదిరెడ్డి జోగినాయుడు, విరాళం అందజేసిన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మల్లునాయుడు ఆధ్వర్యంలో వైసిపి నుండి టిడిపిలోకి భారీగా చేరికలు





చోడవరం, నవంబర్11 పెన్ సత్తా.... తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు, చోడవరం చక్కర కర్మాగారం మాజీ చైర్మన్, ఎంపీపీ అభ్యర్థి గూనూరు మల్లునాయుడు ఆధ్వర్యంలో చోడవరం పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి టిడిపిలో భారీగా చేరికలు జరిగాయి. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు సమక్షంలో ఎంపీపీ అభ్యర్థి గూనూరు మల్లునాయుడు ఆధ్వర్యంలో బోళ్లవీధికి చెందిన అల్లాడ భవాని, జ్యోతుల శ్రీను, అడపా కొండబాబు, అరటి పళ్ళు శంకర్రావు, టైలర్ దేముడు తదితర కుటుంబాలు 400 మంది తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి కండువాలు వేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు, ఎంపిపి అభ్యర్థి గూనూరు మల్లునాయుడు మాట్లాడుతూ.... ఆ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తామని, నిధులు కేటాయించి డ్రైనేజీలు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, టౌన్ పార్టీ అధ్యక్షుడు యర్రంశెట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

పవన్ విడాకుల వ్యవహారంపై మాట్లాడొద్దన్న వైయస్. జగన్ సంస్కారం ఆదర్శనీయం

తాడేపల్లి: నవంబర్11 పెన్ సత్తా....జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మూడో భార్య అన్నా కొణిదలకు విడాకుల వ్యవహారంపై ఎవరూ కూడా బహిరంగంగా, వ్యక్తిగతంగా మాట్లాడవద్దు అని చెప్పడం ద్వారా వైయస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ తమ పార్టీ శ్రేణులకు అత్యంత సంస్కారయుతంగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పార్టీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీ పార్వతి తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలు వేరు, వ్యక్తిగత జీవితాలు వేరని బలంగా నమ్మే వ్యక్తి వైయస్ జగన్ అని కొనియాడారు. పవన్ కళ్యాణ్ విడాకుల వ్యవహారాన్ని రాజకీయంగా వాడుకునే ఆలోచనే చేయకుండా సంయమనం పాటించాలని తమ అధినేత స్పష్టం చేశారన్నారు. అయితే గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, వారి ఎల్లో మీడియా వైయస్ జగన్ కుటుంబ అంతర్గత వ్యవహారాలను, ఆస్తి వివాదాలను పట్టుకుని దారుణంగా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. మరోవైపు వ్యాపారవేత్తగా, సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న వైయస్ భారతిని సోషల్ మీడియాలో ఎంత నీచంగా ట్రోల్ చేశారో గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. ఇకనైనా కూటమి నేతలు బుద్ధి తెచ్చుకుని, మహిళల జోలికి రావడం మానుకోవాలని ఆమె తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ఆమె ఏమన్నారంటే...

వైయస్ జగన్ గారి సంస్కారం -- మా పార్టీ విధానం:

ఎవరి వ్యక్తిగత జీవితాల గురించి మనం మాట్లాడొద్దని మా పార్టీ అధ్యక్షుడు శ్రీ జగన్ గారు మా అందరికీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రాజకీయాలు వేరు, వ్యక్తిగత జీవితాలు వేరని బలంగా నమ్మే వ్యక్తి మా నాయకుడు. పవన్ కళ్యాణ్ విడాకుల వ్యవహారం బయటకు రాగానే దానిపై ఎవరూ స్పందించవద్దని ఆదేశించి ఆయన తన ఉన్నతమైన సంస్కారాన్ని చాటుకున్నారు. రాజకీయాల్లో ఎలా హుందాగా, సంస్కారంగా వ్యవహరించాలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మా జగన్ గారిని చూసి నేర్చుకోవాలి.

వైయస్ భారతి గారిపై నీచమైన ట్రోలింగ్ చేయలేదా?:

దేశమంతా గర్వించదగ్గ ఉత్తమ ఇల్లాలు, ఎన్నో పరిశ్రమలను విజయవంతంగా నడుపుతూ, అన్నదానాలు, ఉచిత విద్యాదానాలు చేస్తూ సేవలందిస్తున్న వైయస్ భారతి పై గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎంత నీచమైన విమర్శలు చేశారు? ఆమె వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ సినిమాలు తీయించి, ఎల్లో మీడియా, సోషల్ మీడియా పెయిడ్ ఆర్టిస్టులతో ఎంత పైశాచికంగా ట్రోలింగ్ చేయించారు? జగన్ గారి కుటుంబంలో ఉండే చిన్న చిన్న ఆస్తి వివాదాలను పట్టుకుని ఇంత దారుణంగా మాట్లాడిన మీరు ఒక్కసారైనా ఆత్మవిమర్శ చేసుకోవాలి.

మహిళల రక్షణపై పవన్ ద్వంద్వ వైఖరి:

మైకుల ముందుకు వస్తే మహిళల రక్షణే నా ప్రథమ కర్తవ్యం అని మాట్లాడే పవన్ కళ్యాణ్, నిజ జీవితంలో మహిళల పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో సమాజం అంతా గమనిస్తోంది. జనసేన పార్టీ ఎమ్మెల్యే ఒకరు బరితెగించి మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడితే పవన్ కనీస చర్యలు తీసుకోలేదు. మొక్కుబడిగా సస్పెండ్ చేసి మళ్లీ పక్కనే కూర్చోబెట్టుకున్నారు. మహిళా అధికారుల వెంటపడే కామాంధులు మీ పార్టీలో ఉంటే వారికి ఏం శిక్ష వేశారు? కూటమి పాలనలో వందలాది మంది మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ ఎందుకు నోరు విప్పడం లేదు?.

టీడీపీ వేధింపులకు బలైన గీతాంజలి:

వైయస్.జగన్ పుణ్యమా అని నా జీవితంలో సొంత ఇల్లు వచ్చిందని అమాయకంగా సంతోషపడిన గీతాంజలి అనే పేద మహిళను టీడీపీ రాక్షసులు వేధించి ఆత్మహత్య చేసుకునేలా చేశారు. ఆమె కళ్లల్లో ఆనందం చూడలేక అర్ధరాత్రి వేళల్లో కూడా అసభ్యకర మెసేజ్‌లు పంపి చంపేశారు. మా మాజీ మంత్రులు రోజా, విడదల రజిని క్యారెక్టర్లను అసాసినేట్ చేస్తూ మీ ఐటీడీపీలో పైశాచిక ఆనందం పొందారు. ఇతర పార్టీల మహిళలకు కుటుంబాలు, పిల్లలు, ఆత్మగౌరవం ఉంటాయన్న స్పృహ మీకు లేదా?

లడ్డూ వివాదం.. పవన్ రాజకీయ డ్రామాలు:

తిరుపతి లడ్డూల విషయంలో చంద్రబాబు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తే, పవన్ కళ్యాణ్ దాన్ని భుజాన వేసుకుని మెట్లు కడిగి పెద్ద డ్రామా చేశారు. అయోధ్యకు లక్ష కల్తీ లడ్డూలు వెళ్లాయంటూ తిరుమల పవిత్రతను, వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని ప్రపంచవ్యాప్తంగా అపహాస్యం చేశారు. జగన్ గారిపై 'క్రిస్టియన్' అంటూ ముద్ర వేసి తిరుమలలో డిక్లరేషన్ పేరిట రభస సృష్టించారు. తన రాజకీయ స్వార్థం కోసం విదేశీ భార్య అన్నా కొణిదలను తిరుమలకు పంపి, తలనీలాలు తీయించి వీడియోలతో పబ్లిసిటీ చేసుకున్న వ్యక్తి పవన్ కళ్యాణ్..

తోడబుట్టిన వారికి ఏం చేశారో చెప్పగలరా?:

సొంత చెల్లెలికి వందల కోట్ల ఆస్తులు ఇచ్చిన ఉదార హృదయం వైయస్ జగన్ గారిది. మరి చంద్రబాబు నాయుడు తన సొంత చెల్లెళ్లకు కనీసం తలదాచుకోవడానికి ఇల్లు ఇవ్వకుండా, ఒక్క పూట అన్నం పెట్టకుండా రోడ్డున పడేసింది వాస్తవం కాదా? అలాంటి చంద్రబాబు జగన్ గారి కుటుంబం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ఆడవాళ్లను అడ్డం పెట్టుకుని ఎదిగిన చంద్రబాబు రాజకీయ జీవితం, చివరికి ఆ ఆడవాళ్ల ఉసురు తగిలే అంతమవుతుంది.ప్రజా జీవితంలో ఉంటే ఆదర్శంగా ఉండాలి:ఈ నేపధ్యంలో మీరు ఎన్ని విడాకులు ఇస్తారో మీ ఇష్టం.. కానీ ఉప ముఖ్యమంత్రిగా, పబ్లిక్ లైఫ్‌లో ఉన్నప్పుడు కనీస నైతికతతో సమాజానికి ఆదర్శంగా బతకడం నేర్చుకోవాలని లక్ష్మీ పార్వతి హితవు పలికారు. చంద్రబాబు అబద్ధాలకు వత్తాసు పలికే తొత్తుగా మారడం మానుకోవాలన్న ఆమె.. ఇప్పటికైనా వైయస్సార్సీపీ మహిళా నేతల వ్యక్తిత్వ హననం ఆపకపోతే, వైయస్ జగన్ కుటుంబంపై అడ్డగోలు విమర్శలు కొనసాగిస్తే ప్రజలే మీకు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

బాబు విజనరీ కారు...జగన్ ప్రజా నేత కాలేరు !



కొత్త పార్టీ పీఆర్పీ ప్రారంభించిన విజయసాయిరెడ్డి సీఎం చంద్రబాబు, వైఎస్ జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఇద్దరికీ నాయకత్వ లక్షణాలు, ప్రజలతో భావోద్వేగ అనుబంధం లేవని వ్యాఖ్యానించారు. తమ పార్టీ ఎవరికీ బీ టీమ్ కాదని స్పష్టం చేస్తూ, యువతకు 66 శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అవును కొత్త పార్టీ పెట్టారు, కొత్త ఉత్సాహం కూడా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చూపించారు. ఏపీలో రెండు ప్రధాన పార్టీల అధినేతలను విమర్శించకపోతే ఆయన పార్టీ ఎలా ముందుకు వెళ్తుంది. తమ పార్టీ ఆల్టర్నేషన్ అని ఎలా జనాలకు చెప్పుకోగలరు. అందుకే ఆయన పార్టీ పుట్టిన చోటు నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబుని విపక్ష నేత వైఎస్ జగన్ ని గట్టిగానే విమర్శించారు. ఒక విధంగా ఇద్దరి మీద తన ప్రసంగంలో విరుచుకుపడ్డారు. ఈ ఇద్దరు నేతల నాయకత్వం మీద వారి పని తీరు మీద కూడా విజయసాయిరెడ్డి తనదైన శైలిలో విశ్లేషించారు.

ఇద్దరూ ఇద్దరే అంటూ :

ముఖ్యమంత్రి చంద్రబాబు తనను విజనరీ అని చెప్పుకుంటారని కానీ ఆయన అది కానే కాదని విజయసాయిరెడ్డి అన్నారు. అలాగే జగన్ ప్రజా నాయకుడిని అని డప్పు కొట్టుకుంటారు కానీ ఆయన ఎప్పటికీ కాలేరని కూడా విజయసాయిరెడ్డి ఫైర్ అయ్యారు. అసలు ఈ ఇద్దరు నాయకులకూ నాయకత్వ లక్షణాలు లేవు అని విజయసాయిరెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ప్రజా నాయకుడు ఎలా ఉండకూడదో ఈ ఇద్దరిని చూస్తే అర్థం అవుతుందని అన్నారు. నాయకుడు అంటే ప్రజల బాధలను తెలుసుకునే వారు అని ఆయన చెప్పారు. జనాలతో ఎమోషనల్ కనెక్టివిటీ ఉండాలి కానీ బాబు జగన్ లలో అది శూన్యం అని విజయసాయిరెడ్డి తేల్చేశారు. నాయకత్వ లక్షణాలతో పాటు ఏదీ లేకున్నా అన్నీ ఉన్నట్లు ప్రచారం చేసుకోవడంలో బాబు జగన్ ఇద్దరూ దిట్టలని విజయసాయిరెడ్డి గట్టిగానే విమర్శించారు.

పీఆర్పీ బీ టీం కాదు :

పీఆర్పీ అన్నది తాను ప్రజల కోసం సొంతంగా ఏర్పాటు చేసిన పార్టీగా విజయసాయి రెడ్డి చెప్పారు. అది ఏ పార్టీకీ బీ టీం కానే కాదని అన్నారు. ఈ విషయంలో తాను దేవుడిపై ప్రమాణం చేస్తున్నానని కూడా విజయసాయిరెడ్డి చెప్పారు. తాను పెట్టిన పార్టీ ప్రజల కోసం వారి శ్రేయస్సు కోసం మాత్రమే అని ఆయన అంటున్నారు. అయితే విజయసాయిరెడ్డి పార్టీ రంగు కాషాయంగా ఉంది. అందులో ధర్మ చక్రం మధ్యలో ఉంది. దాంతో బీజేపీ కాషాయాన్ని ఈ పార్టీ జెండాను పోలిక పెట్టి చూస్తున్నారు. అందుకే విజయసాయిరెడ్డి వివరణ ఇచ్చారు అని అంటున్నారు. ఇక విజయసాయిరెడ్డి బీజేపీని జనసేనను విమర్శించకపోవడం మీద కూడా చర్చ సాగుతోంది. ఈ కారణంగా కూడా ఆయన పార్టీ బీ టీం కాదని చెప్పాల్సి వచ్చింది అని కూడా అంటున్నారు.

యువతకు 66 శాతం :

ఇక విజయసాయిరెడ్డి తన పార్టీలో యువతకు ఏకంగా 66 శాతం సీట్లు ఇస్తామని ప్రకటించారు. అలాగే కుల, మతాలకు అతీతంగా మా పార్టీలో అందరికీ చోటు ఉంటుందని స్పష్టం చేశారు. స్వచ్ఛంగా రాజకీయాలు చేయాలనుకునే వారికి పీఆర్పీ ఒక వేదిక అన్నారు. ఇక పార్టీ జెండాలు ఎన్నికల వేళ పట్టుకోవడానికో కటౌట్ లు కట్టడానికో యువత లేదని వారిని చట్టసభల్లో కూర్చోపెట్టి ప్రజల తరుపున మాట్లాడటానికి యువతను పీఆర్పీ తయారు చేస్తుంది అని విజయసాయిరెడ్డి చెప్పుకొచ్చారు.

విజయసాయిరెడ్డి వెంట నందమూరి తారకరత్న భార్య

విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పీఆర్పీ ఆవిర్భావ కార్యక్రమానికి నందమూరి తారకరత్న భార్య అలేఖ్యరెడ్డి హాజరుకావడం చర్చనీయాంశమైంది. విజయసాయిరెడ్డికి ఆమె వరుసకు కూతురు కావడంతో కుటుంబ అనుబంధంతోనే వచ్చారా? లేక రాజకీయాల్లోకి అడుగుపెట్టే ఆలోచన ఉందా? అనే ఆసక్తి నెలకొంది. అయితే ఆమె రాజకీయ పాత్రపై స్పష్టత లేదు.

విజయసాయిరెడ్డి పార్టీ ప్రకటించడం తెలుగునాట ఓ సంచలనమైంది. ఏపీలో ఇన్నాళ్లు కులాల వారీగా విడిపోయిన పార్టీలకు విజయసాయిరెడ్డి పార్టీతో మరో కాంపిటీషన్ ఎదురైనట్టైంది. ఏపీ రాజకీయాల్లో తాను మార్పు తెస్తానని.. యువత, జెన్ జెడ్, బడుగు బలహీన వర్గాల ఏజెండాతో ముందుకెళ్లనున్నట్టు విజయసాయిరెడ్డి ప్రకటించారు. 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్పీ) అంటూ ప్రకటించి తన కొత్త రాజకీయ ప్రస్తానాన్ని ప్రారంభించారు. పనిలో పనిగా తాను గతంలో పనిచేసిన వైసీపీ నుంచి నేతలందరినీ తన పార్టీలోకి ఆహ్వానించేసి ఓ రకంగా తన మాజీ బాస్ వైఎస్ జగన్ కు షాకిచ్చారనే చెప్పాలి.

రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యామ్నాయ పార్టీగా ఎదుగుతానని ప్రకటించిన విజయసాయిరెడ్డి తన పార్టీకి వెన్నుదన్నుగా కొత్త తరానికి బదులు మిగతా పార్టీల్లోని నేతలనే ముందుగా ఆహ్వానించడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే వైసీపీ అసంతృప్తులకు భారీ ఆఫర్ ఇచ్చిన విజయసాయిరెడ్డి టీడీపీని వదులుతాడా? అన్న చర్చ కూడా సాగింది. కానీ టీడీపీకి సన్నిహితంగా ఉన్న కుటుంబాలను కూడా తన వైపు లాగడంలో విజయవంతమయ్యాడని తాజాగా ఆ వేడుకకు హాజరైన వారిని బట్టి మనకు అర్థమవుతోంది.

విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ఆవిర్భావ కార్యక్రమంలో నందమూరి తారకరత్న సతీమణి అలేఖ్యా రెడ్డి ప్రత్యక్షం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ప్రకటన కంటే అలేఖ్యరెడ్డి హాజరు వెనుక కారణాలపైనే ఇప్పుడు ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. ఆమె విజయసాయిరెడ్డి పార్టీలో ఏదైనా కీలక పాత్ర పోషించబోతున్నారా? లేక బంధువు అయిన విజయసాయిరెడ్డి వెంట ఈ కార్యక్రమానికి హాజరయ్యారా? విజయ సాయిరెడ్డికి వెన్నుదన్నుగా నిలుస్తారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.అయితే తారకరత్న పక్కా టీడీపీ వారసుడే.. ఎన్టీఆర్ కుటుంబంలోని సభ్యుడే. నారా లోకేష్ పాదయాత్రకు వెళ్లి అనూహ్యంగా గుండెపోటుతో మరణించారు. టీడీపీతో మమేకమైన తారకరత్న చనిపోయే వరకూ ఆ పార్టీ కోసమే పనిచేశారు. అయితే ఆయన భార్య ఇప్పుడు విజయసాయిరెడ్డి వెంట నడవడం హాట్ టాపిక్ గా మారింది. ఇది టీడీపీకి షాక్ అనే వారు ఉన్నారు. కానీ బాబాయి కావడంతోనే విజయసాయిరెడ్డి వెంట అలేఖ వెళ్లారని తెలుస్తోంది.

అయితే అలేఖ్య రెడ్డికి వరుసకు విజయసాయిరెడ్డి బాబాయి అవుతాడు. కుటుంబ పరంగా వీరిద్దరి మధ్య అనుబంధం ఉంది. తారకరత్నకు పిల్లనిచ్చి చేయడంలో విజయసాయిరెడ్డి అప్పట్లో కీలక పాత్ర పోషించారు. తారకరత్న పిల్లలతోనూ కొన్ని వీడియోలను ఇటీవల విజయసాయిరెడ్డి చేశారు. అప్పుడప్పుడూ కుటుంబ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

తారకరత్న మరణం తర్వాత తన కూతురు వరుస అయిన అలేఖ్యరెడ్డికి అండగా విజయసాయిరెడ్డి నిలబడ్డారని సమాచారం. తారకరత్న మరణం తర్వాత అలేఖ్యరెడ్డికి విజయసాయిరెడ్డి కుటుంబం అండగా ఉంటోంది. ఇప్పుడు ఆయన పార్టీ పెట్టడంతో అందులో అలేఖ్యరెడ్డి పాల్గొనడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

బాబాయి కొత్త పార్టీ వేళ కుటుంబ సభ్యురాలిగా అలేఖ్య హాజరయ్యారా? లేక భవిష్యత్తులో ఆమె కూడా రాజకీయాల్లోకి అడుగుపెట్టే ఆలోచన చేస్తున్నారా? అన్నది ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.

ఏపీలో రాజకీయ శూన్యత ...టీడీపీ వైసీపీ సంగతేంటి ?

ఏపీలో రాజకీయ శూన్యత ఉందన్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై చర్చ జరుగుతోంది. టీడీపీ, వైసీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉండగా, జనసేన కూడా గణనీయమైన మద్దతు కలిగి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పార్టీకి ఎంతవరకు ఆదరణ లభిస్తుందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయాల్లో శూన్యత ఎప్పుడూ ఉండదు, సముద్రం ఇంకిపోదు, మహానదులు ఎండిపోవు అన్నట్లుగా రాజకీయాల్లో ఎపుడూ ఖాళీ అన్నది అసలు ఉండదు, అయితే పాత వాటిని తోసుకుంటూ కొత్తగా వచ్చే పార్టీలు ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి చూసే క్రమంలో అవి తగ్గిపోవడమో వెనకబడడమో బలహీన పడడమో జరుగుతుంది. మరి అంతలా బలంగా దూసుకుని వచ్చే పార్టీలు వస్తేనే తప్ప పాత వాటికి కనుమరుగు ఉండదు. కానీ ఏపీలో రాజకీయ శూన్యత ఉందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అంటున్నారు. అందుకే కొత్త పార్టీ పెట్టాను అని ఆయన చెబుతున్నారు. ఇది నిజమేనా అంటే దానికి సంబంధించిన లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది.

బలమైన ఓటు షేర్ :

ఏపీలో రెండు ప్రధాన పార్టీలుగా టీడీపీ వైసీపీ ఉన్న సంగతి విధితమే. ఈ రెండు పార్టీలకు చెరి నలభై శాతం ఓటు షేర్ ఉంది అని అంటారు. అంటే 80 శాతం రాజకీయ మైదానాన్ని ఈ పార్టీలే ఆక్రమించాయన్న మాట. ఇక ఆ మిగిలిన ఇరవై శాతంలో జనసేన పది శాతం అయినా ఓటు షేర్ తో ఉందని అంటారు. బీజేపీ కాంగ్రెస్ వామపక్షాలు తదితర పార్టీలు అయిదు శాతం ఓటు షేర్ తీసుకున్న ఒక్క అయిదారు శాతం మాత్రమే ఖాళీ ఉంది. మరి దానినే రాజకీయ శూన్యతగా భావించాలా అన్నది ఒక చర్చగా ముందుకు వస్తోంది.

విభజించబడ్డారు :

ఇక ఏపీలో పార్టీలకు కార్యకర్తలే కాదు జనాలు కూడా విభజించబడ్డారు అని గత కొన్ని ఎన్నికల నుంచి సాగుతున్న ఓటింగ్ విధానం కానీ పరిణామాలు కానీ చెబుతున్నాయి. ఒక విధంగా తమిళనాడు తరహాలో అన్న మాట. అక్కడ డీఎంకే అన్నా డీఎంకే ఓటర్లు సెపరేట్ గా ఉంటారు. వారు ఆ పార్టీలకే ఓటు వేస్తారు.



అయితే సునామీగా దూసుకొచ్చిన టీవీకే సంప్రదాయ పార్టీల ఓట్లను తాను తీసుకోవడంతో బలమైన ఆల్టర్నేషన్ గా మారింది. ముందే చెప్పినట్లు కొత్త పార్టీ తుఫాన్ గా వస్తేనే తప్ప వట వృక్షాలు గా మారి వేళ్ళూనుకుపోయిన పాత పార్టీలు కొట్టుకుపోయే పరిస్థితి ఉండదు, మరి ఆ స్థాయిలో కొత్త పార్టీగా విజయసాయి రెడ్డి పెట్టిన పీఆర్పీ ఉందా అన్నదే చర్చగా ఉంది.

ఏపీకి అవసరమా :

ఇక దేశంలో ఏ రాష్ట్రంలో అయినా రాజకీయ ప్రయోగాలు అంతగా విజయవంతం కావడం లేదు. దానికి కారణం జనంలో ఉన్న ఒక రకమైన భావన. సర్దుకుపోయే తత్వం, కొత్త మీద కొంత కలవరం, పాతతోనే పోతే ఉండే సౌఖ్యం. ఇలా చాలా విషయాలు ఉన్నాయి. మరీ బాగా లేదు, తెగించాల్సిందే అన్న నాడే జనాలు ఆల్టర్నేషన్ వైపు చూసిన సందర్భాలు ఉన్నాయి.

అందుకే దేశంలో కాంగ్రెస్ ఆరు దశాబ్దాల పాటు ఏలింది. ఉమ్మడి ఏపీలో కూడా మూడున్నర దశాబ్దాల పాటు పాలించింది. ఇక విభజన ఏపీ విషయానికి వస్తే జనం మూడ్ కొత్త పార్టీలు కొత్త రాజకీయం వైపు ఉందా అన్నది కీలకమైన ప్రశ్న. ఎందుకంటే విభజనతో ఏపీ దారుణంగా నష్టపోయింది అన్నది అంతా గుర్తు పెట్టుకోవాల్సి ఉంది.

మరో అర్ధ శతాబ్దం :

ఏపీ ఒక రూపునకు రావాలీ అంటే మరో అర్ధ శతాబ్దం పడుతుందని కూడా విశ్లేషణలు ఉన్నాయి. అలాంటి చోట తడవకో పార్టీని తెచ్చి నూతన ప్రయోగాలు జనాలు చేస్తారా అన్నది కూడా ఆలోచించాల్సిన విషయమే అంటున్నారు. ఏపీలో టీడీపీ కూటమి చెబుతున్నది చూస్తే మరో మూడు ఎన్నికల వరకూ తామే గెలిస్తేనే ఏపీ గాడిలో పడుతుంది అని. మరో వైపు వైసీపీ చూస్తే అధికారం కోసం కాచుకుని ఉంది. ఈ రెండు పార్టీలు అధికారం అందుకుని అనుభవం గడించి ఉన్నాయి. అలాంటి చోట కొత్త ప్రయోగంగా వచ్చిన పార్టీలు ఏ మేరకు సక్సెస్ అవుతాయన్నది చూడాల్సి ఉంది. ఇక విజయసాయిరెడ్డి చెబుతున్నట్లుగా రెండు కులాలు రెండు కుటుంబాలు అన్నది కూడా బలమైన రాజకీయానికి దారి తీసినవి అన్నది చూడాలి. కులాల సమీకరణతో సాగే ఏపీ రాజకీయాలలో కుటుంబాలకు ఉన్న రాజకీయ ఇమేజ్ తో ఓటు బ్యాంకు స్థిరీకరించుకున్న క్రమంలో రెండు పార్టీలను పక్కన పెట్టాలీ అంటే జనాలు ఎలా స్పందిస్తారు అన్నది ఆలోచించాలి. ఇక రాజకీయ శూన్యత ఏపీలో ఉందా అంటే లేదు అన్నదే జవాబుగా కనిపిస్తోంది.

కొత్త కోవిడ్ వేరియంట్ PJ.2.1.. మళ్లీ కరోనా భయం అవసరమా?



PJ.2.1 అనే కొత్త కోవిడ్ వేరియంట్ కెనడా, అమెరికా, సింగపూర్ సహా పలు దేశాల్లో గుర్తించారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, అలసట వంటి సాధారణ కరోనా లక్షణాలే కనిపించవచ్చు. ఈ వేరియంట్ గత రకాల కంటే ప్రమాదకరమని ఆధారాలు లేవని, భారత్‌లోనూ విస్తృత వ్యాప్తి నిర్ధారణ కాలేదని కథనం పేర్కొంది.కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన విషయం తెలిసిందే. ఇప్పటికీ ఈ వైరస్ పూర్తిగా కనుమరుగవ్వలేదు. ఎప్పటికప్పుడు కొత్త వేరియంట్ల రూపంలో బయటపడుతోంది. తాజాగా PJ.2.1 అనే కొత్త కోవిడ్ వేరియంట్ పలు దేశాల్లో గుర్తించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో మళ్లీ కరోనా కేసులు పెరుగుతాయా? అనే ఆందోళన మొదలైంది.

అసలు PJ.2.1 అంటే ఏమిటి?

PJ.2.1 అనేది కరోనా వైరస్‌లో వచ్చిన కొత్త మార్పులతో ఏర్పడిన ఉపరకం. ఇది JN.1 వేరియంట్ కుటుంబానికి చెందినది. వైరస్ మన శరీరంలోకి ప్రవేశించడానికి ఉపయోగపడే స్పైక్ ప్రోటీన్‌లో కొన్ని మార్పులు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ల ద్వారా ఏర్పడిన యాంటీబాడీలు ఈ వేరియంట్‌ను ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉన్నట్లు ప్రాథమిక పరీక్షల్లో వెల్లడైంది.

ఏయే దేశాల్లో గుర్తించారు?

2026 మే 2న కెనడాలోని ఒంటారియోలో తొలిసారిగా ఈ వేరియంట్‌ను గుర్తించారు. ఆ తర్వాత అమెరికా, సింగపూర్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాల్లోనూ బయటపడింది. కెనడాలో దీని వ్యాప్తి క్రమంగా పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.


లక్షణాలు ఎలా ఉంటాయి?

ఈ కొత్త వేరియంట్‌కు ప్రత్యేకమైన లక్షణాలు ఉన్నట్లు ఇప్పటివరకు గుర్తించలేదు. సాధారణ కరోనా లక్షణాలైన జ్వరం, దగ్గు, గొంతునొప్పి, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అలసట వంటివి కనిపించవచ్చు. కొందరిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కూడా ఉండవచ్చు.

భారత్‌కు ముప్పు ఉందా?

PJ.2.1 వేరియంట్ గతంలో వచ్చిన కరోనా రకాల కంటే ప్రమాదకరమని, మరణాలు పెంచుతుందని ఇప్పటివరకు ఆధారాలు లేవు. భారత్‌లో కూడా ఈ వేరియంట్ విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు నిర్ధారణ కాలేదు. కాబట్టి ఇప్పుడే భయపడాల్సిన అవసరం లేదు. అయితే వృద్ధులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. కరోనా లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. కొత్త వేరియంట్లపై ఆరోగ్య శాఖలు నిఘా కొనసాగించడం అవసరం.

జగన్ గ్రౌండ్ లోకి దిగాల్సిందే... లేకపోతే కష్టమేనట !



2024 ఓటమి తర్వాత జగన్ తాడేపల్లి, బెంగళూరుకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పార్టీ సర్వేలతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా తెలుసుకోవాలని సూచనలు వస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై జిల్లాల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు, కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించాలని, 2029 ఎన్నికలే లక్ష్యంగా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.వైసీపీ అధినేత జగన్ 2024 ఓటమి తరువాత ఎక్కువగా తాడేపల్లి టూ బెంగళూరు గానే షటిల్ సర్వీస్ చేస్తున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. ఆయన పార్టీ వారితో అపుడపుడు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అది కూడా నియోజకవర్గాల ఇంచార్జిలు, రీజనల్ కోఆర్డినేటర్లు, పార్టీ సీనియర్ నేతలు ఇలా పై స్థాయిలో మాత్రమే. వారితో మాట్లాడుతూ పార్టీని వారి ద్వారానే నడిపిస్తున్నారు. ఇక అక్కడ వచ్చే ఇన్ పుట్స్ అన్నవి అధినాయకత్వానికి అందుతున్నాయి. కానీ అవే నిజం అనుకుంటే గ్రౌండ్ లెవెల్ లో ఏమి జరుగుతుందో ఫీడ్ బ్యాక్ ఎలా తెలుస్తుంది అన్నది చర్చగా ఉంది. అయితే వైసీపీ అధినాయకత్వం అక్కడితో ఆగకుండా తమ సొంత సర్వేలు చేయిస్తోంది. అలా ఏపీలో ఓటమి మీద చేయించిన సర్వేలలో చాలా విషయాలు తెలిసాయని అంటున్నారు.

ఎంతవరకూ చూడాలి :ఇక ఈ సర్వే నివేదికలు అన్నవి కూడా కొంత పరిమితితో కూడి ఉంటాయని అంటున్నారు. నిజానికి వైసీపీకి సర్వేలు పెద్దగా అచ్చి రాలేదని అంటారు. 2019 ఎన్నికల వేళ తప్పించి 2024 సర్వేలు పూర్తిగా బోల్తా కొట్టించాయి. అంతకు ముందు పలు సందర్భాల్లో చేయించిన సర్వేలు కూడా పూర్తి వాస్తవాలను అధినాయకత్వం ముందు ఉంచలేకపోయాయని గుర్తు చేస్తున్నారు. మరి ఈ సర్వేలు అయితే ఒక మాదిరి పిక్చర్ ని మాత్రమే ఇస్తాయని తెలుస్తోంది. దాంతో పూర్తి విషయలు తెలియాలి అంటే ఏమి చేయాలి అన్నది ప్రశ్న ఉంది. దానికి జవాబు కూడా ఉంది. అదే జగన్ గ్రౌండ్ లెవెల్ లోకి డైరెక్ట్ గా దిగాల్సిందే అని అంటున్నారు.

సమీక్షలు అక్కడే :వైసీపీ అధినాయకత్వం స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల మధింపుని చేస్తోంది అని అంటున్నారు. అయితే అవి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కాకుండా జిల్లాలకు వెళ్ళి క్షేత్ర స్థాయిలో ద్వితీయ తృతీయ శ్రేణి నాయకులతో పాటు క్యాడర్ తో కలిసి కూర్చుని చర్చిస్తేనే పూర్తి సమాచారం పక్కాగా వస్తుంది అని అంటున్నారు. లేకపోతే మాత్రం ఎప్పటికీ వైసీపీకి ఈ ఇబ్బందులు తప్పవని కూడా అంటున్నారు. ఏపీలో వైసీపీకి గత అనుభవాలు ఉన్నాయి, ఓటములు ఉన్నాయి. కానీ 2024 తరువాత పరిస్థితులు వేరు అని అంటున్నారు.

బలంగా కూటమి :రాజకీయాల్లో కూటములు బలంగా ఉన్నపుడు సహజంగానే మొగ్గ ఆ వైపు ఉంటుంది. ఏపీలో కొన్ని రీజియన్లలో అదే జరుగుతోంది అని అంటున్నారు. ఇక కొన్ని చోట్ల తీసుకుంటే వైసీపీకి బలం ఉండి కూడా ఎత్తిగిల్లలేకపోతోంది. మరి కొన్ని చోట్ల అన్నీ ఉండి వర్గ పోరుతో సతమతం అవుతోంది. ఇలా వివిధ కారణాలు ఉన్నాయి. ఇక ఇన్ చార్జిలలో అనేక మంది గడచిన రెండున్నరేళ్లుగా గ్రౌండ్ లెవెల్ లో పనిచేయడం లేదని చెబుతున్నారు. అలాగే క్యాడర్ కి లీడర్లకు మధ్య గ్యాప్ అలాగే ఉందని అంటున్నారు. అది స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగడం వల్లనే చేదు ఫలితాలు వచాయని చెబుతున్నారు.

సంస్థాగతంగా :అదే విధంగా చూస్తే సంస్థాగతంగా వైసీపీ నిర్మాణంలో కూడా మరమ్మతులు చేయాల్సి ఉందని అంటున్నారు. ప్రస్తుతం అనేక చోట్ల ఇన్ చార్జిలను అధినాయకత్వం ప్రకటించింది. వారిని పై నుంచి దిగుమతి చేసింది. దాంతో క్యాడర్ మెచ్చిన నాయకులు కొన్ని చోట్ల ఉంటే మరి కొన్ని చోట్ల లేరని అంటున్నారు. అలా కాకుండా క్యాడర్ తో చర్చించి అందరికీ అందుబాటులో ఉండే వారిని ఇకనైనా ఏర్పాటు చేసుకుంటే 2029 ఎన్నికల నాటికి వైసీపీ బలపడుతుందని అంటున్నారు. పార్టీ కోసం గట్టిగా పనిచేసేవారికి ఛాన్స్ ఇవ్వాలని అలాగే 2029 ఎన్నికల్లో వారికే చాన్స్ ఇస్తామని భరోసా కల్పించాలని అపుడే వారు గట్టిగా పనిచేస్తారు అని అంటున్నారు.

రైతులకు కేంద్రం భారీ ఊరట

న్యూఢిల్లీ: రైతులు, చిన్న వ్యాపారవేత్తలకు ప్రయోజనం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రబీ 2026-27 సీజన్‌లో రైతులకు ఎరువులపై సబ్సిడీ అందించేందుకు రూ.62,370 కోట్లు కేటాయించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ పరిణామాలతో ఎరువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులపై అదనపు భారం పడకుండా ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా 50 కిలోల డీఏపీ బస్తా ధరను గతంలో మాదిరిగానే రూ.1,350గా కొనసాగించనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో వ్యవసాయం, సూక్ష్మ పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, మౌలిక సదుపాయాలకు సంబంధించి పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయాల వివరాలను వెల్లడించారు.

ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

రబీ 2026-27 సీజన్‌కు సంబంధించి ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై రూ.62,370 కోట్ల సబ్సిడీ అందించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరిగాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ఎరువులు అందుబాటు ధరల్లో లభించేలా సబ్సిడీ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డీఏపీతో పాటు ఇతర ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై పోషకాల ఆధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) విధానం ప్రకారం రాయితీలు అందించనున్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగినా దేశీయ రైతులపై ఆ ప్రభావం పరిమితంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా డీఏపీ 50 కిలోల బస్తా ధర రూ.1,350గానే కొనసాగుతుందని కేంద్రం స్పష్టం చేసింది.

ముద్రా రుణాలకు మరో ఐదేళ్ల గడువు

సూక్ష్మ పరిశ్రమలకు ఆర్థిక భరోసా కల్పించే క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్ (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం



తెలిపింది. ఈ పథకం 2031 మార్చి వరకు కొనసాగనుంది. ప్రధానమంత్రి ముద్రా యోజన కింద బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించే రుణాలకు క్రెడిట్ గ్యారెంటీ రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. రుణగ్రహీతలు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో రుణ సంస్థలకు కలిగే నష్టభారాన్ని తగ్గించేందుకు ఈ గ్యారెంటీ ఉపయోగపడుతుంది.

2016లో ముద్రా యోజన ప్రారంభమైనప్పటి నుంచి 2026 సెప్టెంబర్ వరకు 60.36 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.43.34 లక్షల కోట్లుగా ఉంది. ఈ పథకం కొనసాగింపునకు రూ.5,000 కోట్ల నిధులు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదించింది. తద్వారా రానున్న కాలంలో రూ.12.6 లక్షల కోట్ల విలువైన ముద్రా రుణాలకు మద్దతు లభించనుంది.

స్టాండప్ ఇండియాకు మరో ఐదేళ్లు

మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే స్టాండప్ ఇండియా పథకాన్ని కూడా మరో ఐదేళ్లపాటు పొడిగించారు. 2031 మార్చి 31 వరకు ఈ పథకం అమల్లో ఉండనుంది. ఈ పథకం ద్వారా రానున్న ఐదేళ్లలో అదనంగా 2.5 లక్షల మంది పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. 2016 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 2.75 లక్షల మందికి పైగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి రుణాలు అందాయి. కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ సంస్థలను ఏర్పాటు చేయాలనుకునే వారికి రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణాలు అందిస్తారు. తయారీ, సేవలు, వాణిజ్యం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించేందుకు ఈ రుణాలు ఉపయోగపడతాయి. ప్రతి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకు శాఖ కనీసం ఒక ఎస్సీ లేదా ఎస్టీ వ్యాపారవేత్తకు, ఒక మహిళా వ్యాపారవేత్తకు రుణం అందించాలన్నది ఈ పథకం లక్ష్యం. ఈ రుణాలకు గరిష్ఠంగా 18 నెలల మారటోరియం సదుపాయం ఉంటుంది. రుణాన్ని ఏడేళ్లలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రుణ మొత్తంలో 85 శాతం వరకు క్రెడిట్ గ్యారెంటీ సదుపాయం కల్పిస్తారు.

యుగే యుగీన్ మ్యూజియానికి రూ.3,230 కోట్లు

దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు పరిచయం చేసే లక్ష్యంతో యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీలోని చారిత్రక నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ భవనాలను మ్యూజియం ప్రాంగణంగా అభివృద్ధి చేయనున్నారు. దేశ చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలు, కళలు, సంస్కృతి, వారసత్వ సంపదను ఒకే చోట ప్రదర్శించేలా ఈ ప్రాజెక్టును రూపొందించనున్నారు.

నోయిడా మెట్రోకు రూ.2,390 కోట్లు

ఉత్తరప్రదేశ్‌లో మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. నోయిడా సెక్టార్-51 నుంచి గ్రేటర్ నోయిడాలోని సెక్టార్-4 వరకు మెట్రో మార్గాన్ని నిర్మించేందుకు రూ.2,390 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే నోయిడా, గ్రేటర్ నోయిడా మధ్య ప్రయాణించే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు ఎరువుల ధరల భారం తగ్గించడం, చిన్న వ్యాపారాలకు రుణ భరోసా కల్పించడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, పట్టణ రవాణా సదుపాయాలను విస్తరించడం వంటి పలు అంశాలకు కేంద్ర కేబినెట్ నిర్ణయాల్లో ప్రాధాన్యం లభించింది.

విదేశీయులకు వీసా విధానంలో భారీ మార్పులు

న్యూఢిల్లీ: భారత్‌ను సందర్శించాలనుకునే విదేశీ పౌరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. దేశ వీసా విధానంలో సమూల మార్పులు చేస్తూ వీసా కేటగిరీల సంఖ్యను తగ్గించింది. ఇప్పటివరకు ఉన్న 13 ప్రధాన వీసా విభాగాలను 9కి, 49 ఉప విభాగాలను 23కి కుదించింది. అంతేకాకుండా వీసా దరఖాస్తు ఫారాల్లోనూ భారీగా మార్పులు చేసింది. దరఖాస్తుదారులు వివరాలు నమోదు చేసే ఫీల్డ్స్ సంఖ్యను 65 నుంచి 70 శాతం వరకు తగ్గించినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు.


9 ప్రధాన వీసా కేటగిరీలు ఇవే

కొత్త విధానంలో వీసాలను ప్రయాణ ఉద్దేశాలకు అనుగుణంగా తొమ్మిది ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు.

1. బిజినెస్ వీసా -- వ్యాపార కార్యకలాపాలు, పెట్టుబడులు.
2. డిప్లొమాటిక్ వీసా -- దౌత్య సంబంధిత పర్యటనలు.
3. వర్క్ వీసా -- ఉద్యోగ, ఉపాధి అవసరాలు.
4. జర్నలిస్ట్ వీసా -- పాత్రికేయ కార్యకలాపాలు.
5. మెడికల్ వీసా -- వైద్య చికిత్స.
6. అఫీషియల్ వీసా -- అధికారిక పర్యటనలు.
7. స్టూడెంట్ వీసా -- విద్య, పరిశోధన.
8. విజిటర్ వీసా -- పర్యాటకం, ఇతర స్వల్పకాలిక సందర్శనలు.
9. మిసిలేనియస్ వీసా -- ఇతర ప్రత్యేక అవసరాలు.

టూరిస్ట్ వీసా స్థానంలో విజిటర్ వీసా

కొత్త విధానంలో టూరిస్ట్ వీసా పేరును విజిటర్ వీసాగా మార్చారు. దీన్ని ఎ-1, ఎ-2 అనే రెండు ఉప విభాగాలుగా



విభజించారు. ఎ-1 వీసా ద్వారా పర్యాటకంతో పాటు వ్యాపార సమావేశాలు, వైద్య సంప్రదింపులు, వెల్‌నెస్ కార్యక్రమాలు, స్వల్పకాలిక కోర్సులకు వెళ్లవచ్చు. ఇది 30 రోజుల కాలపరిమితితో మల్టిపుల్ ఎంట్రీ సదుపాయంతో ఉంటుంది.

ఎ-2 వీసా దీర్ఘకాలిక సందర్శనల కోసం ఉద్దేశించారు. నిబంధనల ప్రకారం ఒకటి, ఐదు లేదా పదేళ్ల కాలపరిమితితో ఈ వీసా జారీ చేస్తారు. పర్వతారోహణకు సంబంధించిన సందర్శనలకూ ఇందులో అవకాశం కల్పించారు.

వైద్య, విద్యార్థి వీసాల్లోనూ మార్పులు

వైద్య చికిత్స కోసం వచ్చే విదేశీయులకు వీసా విధానాన్ని మరింత స్పష్టంగా రూపొందించారు. సాధారణ వైద్య చికిత్సలకు వీ-1, ఆయుష్ వైద్య విధానాల చికిత్సకు వీ-3 వీసాలను కేటాయించారు. రోగులతో పాటు వచ్చే సహాయకుల కోసం వీ-2, వీ-4 వీసా విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ వీసాలకు సాధారణంగా ఏడాది కాలపరిమితితో మల్టిపుల్ ఎంట్రీ సదుపాయం ఉంటుంది.

విద్యార్థి వీసాలను ఎ-1, ఎ-2గా విభజించారు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ, పీజీ చదువుల వరకు ఎ-1 వర్తిస్తుంది. పీహెచ్‌డీ, పరిశోధకులు, విజిటింగ్ ఫ్యాకల్టీ, ఇంటర్న్‌షిప్‌లు, ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లకు ఎ-2 వర్తిస్తుంది.

బిజినెస్ వీసాలకూ ప్రత్యేక విభజన

వ్యాపార అవసరాల కోసం భారత్‌కు వచ్చే విదేశీయులకు వీ-1, వీ-2 విభాగాలను రూపొందించారు. దీర్ఘకాలిక వ్యాపార కార్యకలాపాలు, పరిశ్రమల స్థాపన వంటి అవసరాలకు వీ-1 వీసా ఉపయోగపడుతుంది. స్వల్పకాలిక ఒప్పందాలు, సమావేశాలు, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, సినిమా నిర్మాణం వంటి కార్యకలాపాలకు వీ-2 వీసా వర్తిస్తుంది.

భారతీయ కంపెనీలకు అవసరమైన విదేశీ సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లు, ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన సిబ్బంది సేవలను వినియోగించుకునేందుకు కూడా ప్రత్యేక వెసులుబాటు కల్పించారు.

ఏడాది చివరి నుంచి కొత్త విధానం అమలు

వీసా విధానంలో చేసిన మార్పులను అమలు చేసేందుకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ తన ఐటీ వ్యవస్థలను ఆధునీకరిస్తోంది. 2026 ఏడాది చివరి నాటికి కొత్త విధానం ప్రకారం వీసాల జారీ ప్రక్రియ ప్రారంభం కానుందని కేంద్రం వెల్లడించింది. ఈ మార్పులతో విదేశీ పర్యాటకులు, వైద్య సేవల కోసం వచ్చే వారు, విద్యార్థులు, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలకు దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

అయోధ్యలో అద్భుత రామ్ దర్బార్

అయోధ్య: రామనామ స్మరణతో మారుమోగుతున్న అయోధ్యలో మరో అద్భుత కళాఖండం ఆవిష్కృతమైంది. 2026 దీపోత్సవ వేడుకల్లో భాగంగా సరయూ నదీ తీరంలో నిర్మించిన భారీ రామ్ దర్బార్ సైకత శిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏకంగా 220 టన్నుల ఇసుకతో 58 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తులో రూపొందించిన ఈ అద్భుత కళాకృతికి 'బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' అధికారిక గుర్తింపు లభించింది. అంతర్జాతీయ సైకత శిల్పి మధురేంద్ర కుమార్ తన బృందంతో కలిసి ఈ అరుదైన శిల్పాన్ని రూపొందించారు.

220 టన్నుల ఇసుకతో అద్భుత సృష్టి

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అయోధ్యలోని రామ్ కథా పార్క్‌లో ఈ భారీ శిల్పాన్ని నిర్మించారు. సరయూ నది నుంచి సేకరించిన 220 టన్నుల ఇసుకను ఇందుకోసం వినియోగించారు. రామమందిర నమూనాతో పాటు రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడితో కూడిన రామ్ దర్బార్‌ను అత్యంత నైపుణ్యంతో తీర్చిదిద్దారు. ప్రపంచ శాంతి, మానవత్వం, సోదరభావం సందేశాలను ప్రతిబింబించేలా ఈ కళాఖండాన్ని రూపొందించారు.

ఏడు రోజులపాటు నిర్విరామంగా నిర్మాణం

అక్టోబర్ 30న ప్రారంభమైన శిల్ప నిర్మాణ పనులు నవంబర్ 7 వరకు ఏడు రోజులపాటు కొనసాగాయి. భారీ



పరిమాణంలో ఇసుకను ఉపయోగించి సున్నితమైన ఆకృతులను చెక్కడం కళాకారులకు పెద్ద సవాలుగా మారింది. అయినప్పటికీ మధురేంద్ర కుమార్ బృందం పట్టుదలతో పనులను పూర్తి చేసింది. రామ్ దర్బార్ ఇతివృత్తంతో తాను రూపొందించిన తొలి భారీ సైకత శిల్పం ఇదేనని మధురేంద్ర కుమార్ వెల్లడించారు. ఈ స్థాయిలో పొడవైన రామ్ దర్బార్ శిల్పాన్ని ఇసుకతో నిర్మించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో గుర్తింపు

ఈ భారీ కళాఖండానికి సంబంధించిన వివరాలను అక్టోబర్ 30న బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థలకు సమర్పించారు. నవంబర్ 7న బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి అధికారిక ఆమోదం లభించింది. ×చీణ/2026/001810 రికార్డు నంబరుతో గుర్తింపు నమోదు చేసి డిజిటల్ సర్టిఫికెట్ జారీ చేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు ప్రక్రియ మాత్రం ఇంకా కొనసాగుతోంది.

ప్రముఖుల ప్రశంసలు

దీపోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ భారీ శిల్పాన్ని సందర్శించారు. కళాకారుల నైపుణ్యాన్ని పరిశీలించి అభినందించారు. ఈ చారిత్రక కళాఖండాన్ని అయోధ్య ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రశంసించారు. ఉపరాష్ట్రపతి సైతం శిల్పకళా నైపుణ్యాన్ని కొనియాడారు.

12కు పైగా ప్రపంచ రికార్డుల సృష్టికర్త

బిహార్‌లోని తూర్పు చంపారన్‌కు చెందిన మధురేంద్ర కుమార్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సైకత శిల్పి. ఇప్పటివరకు 25కు పైగా దేశాల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. 12కు పైగా ప్రపంచ రికార్డులు సాధించారు. ఇసుకతో పాటు బొగ్గు బూడిద, ఆకులు, పండ్లు, కూరగాయలు, పునర్వినియోగ వస్తువులతో వేలాది కళాఖండాలను రూపొందించారు. అమెరికా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి ఇసుక కళలో గౌరవ డాక్టరేట్ కూడా అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, వ్యసన విముక్తి, ప్రపంచ శాంతి వంటి అంశాలను తన కళాఖండాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆయన ప్రత్యేకత.

30 లక్షలకు పైగా దీపాలతో అయోధ్య వెలుగులు

మరోవైపు 2026 దీపోత్సవ వేడుకలు అయోధ్యలో అంగరంగ వైభవంగా జరిగాయి. సరయూ నదీ తీరంలోని 56 ఘాట్లలో 30 లక్షలకు పైగా మట్టి ప్రమిదలను వెలిగించి దీపాల కాంతులతో నగరాన్ని అలంకరించారు. పదో దీపోత్సవ వేడుకలు భక్తి, ఆధ్యాత్మిక శోభ మధ్య ఘనంగా నిర్వహించారు. రామమందిర నిర్మాణం అనంతరం అయోధ్యకు పెరుగుతున్న అంతర్జాతీయ గుర్తింపులో ఇలాంటి కళాఖండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సంప్రదాయం, కళానైపుణ్యం, ఆధ్యాత్మికత కలగలిసిన ఈ భారీ రామ్ దర్బార్ శిల్పం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీ నగరాల హవా..

విశాఖకు అగ్రతాంబూలం

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26' వార్షిక సర్వేలో ఆంధ్రప్రదేశ్ నగరాలు ఘన విజయం సాధించాయి. దేశవ్యాప్త స్వచ్ఛతా ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు నగరాలు జాతీయ స్థాయిలో పురస్కారాలను కైవసం చేసుకున్నాయి. ఓవరాల్ విభాగంలో విజయవాడ దేశంలోనే మూడో అత్యంత స్వచ్ఛమైన నగరంగా నిలిచింది. న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులను అందజేశారు. వివిధ జనాభా వర్గాల వారీగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లోనూ ఏపీ నగరాలు ముందంజలో నిలిచాయి. 10 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని అగ్రగామిగా నిలిచింది. ఈ విభాగంలో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో మూడో స్థానంలో నిలిచాయి. అలాగే 3 లక్షల నుంచి 10 లక్షల లోపు జనాభా ఉన్న నగరాల కేటగిరీలో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ కేటగిరీలో ఉజ్జయిని మొదటి స్థానం, చండీగఢ్ రెండో స్థానం సాధించాయి. ఓవరాల్ ర్యాంకింగ్స్ పరిశీలిస్తే.. మహారాష్ట్రకు చెందిన నవీ ముంబై దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. గుజరాత్‌కు చెందిన సూరత్ రెండో స్థానంలో నిలవగా, విజయవాడ మూడో స్థానాన్ని సొంతం చేసుకుంది. గత ఎనిమిదేళ్లుగా స్వచ్ఛ నగరాల ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలుస్తూ వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఇండోర్ నగరం ఈసారి టాప్ స్థానాల్లో చోటు దక్కించుకోలేకపోవడం గమనార్హం. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 10వ ఎడిషన్ (సూపర్ స్వచ్ఛ లీగ్)లో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 4,751 నగరాల్లో ఈ సర్వే చేపట్టారు. గత ఏడాది సూపర్ స్వచ్ఛ లీగ్‌లో ఇండోర్ మొదటి స్థానంలో, సూరత్ రెండో స్థానంలో, నవీ ముంబై మూడో స్థానంలో నిలిచాయి. ఇతర విభాగాల ఫలితాలు చూస్తే.. రివర్‌ఫ్రంట్ నగరాల విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన రేవా మొదటి స్థానంలో, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిలాస్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారణాసి మూడో స్థానంలో నిలిచాయి. తీరప్రాంత పట్టణాల కేటగిరీలో ఒడిశాకు చెందిన పూరీ అగ్రస్థానంలో నిలవగా, కేరళకు చెందిన అలప్పుళ రెండో స్థానం, మహారాష్ట్రకు చెందిన రత్నగిరి మూడో స్థానం పొందాయి. హిమాలయ ప్రాంత నగరాల విభాగంలో ఉత్తరాఖండ్‌కు చెందిన రుద్రపూర్ ప్రథమ స్థానాన్ని, జమ్ము ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. దేశవ్యాప్త పోటీలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలు అగ్రశ్రేణిలో నిలిచి రాష్ట్ర ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో మరింత పెంచాయి.

మేధో సంపత్తి వివాదాలకు ఆ హైకోర్టే శరణ్యం అనుకోవడం భ్రమ..

తమకు అనుకూలమైన న్యాయస్థానాలను ఎంచుకుంటూ పిటిషన్లు దాఖలు చేసే 'ఫోరమ్ షాపింగ్' (లేదా లిటిగేషన్ టూరిజం) ధోరణిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సాంకేతిక పరిధి ఉందన్న ఏకైక కారణంతో సుదూర ప్రాంతాల్లోని హైకోర్టులను ఆశ్రయించడం సరైంది కాదని స్పష్టం చేసింది. మేధో సంపత్తి హక్కుల (ఐపీ) వివాదానికి సంబంధించి ఢిల్లీ హైకోర్టులో నడుస్తున్న ఒక వాణిజ్య దావాను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి బెంగళూరు రూరల్ జిల్లా నెలమంగళకు చెందిన 'మెసర్స్ శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఆగ్రో ఫుడ్స్', ఇతర సంస్థలు వాది (ప్లైంటిఫ్) పక్షంగా ఢిల్లీ హైకోర్టులో వాణిజ్య దావా ళిజూ(జూవీవీ) 625/2026రి వేశాయి. చెన్నైకి చెందిన 'సాయి మహాలక్ష్మి ట్రేడర్స్' సహా మరికొందరు ప్రతివాదులుగా ఉన్నారు. అయితే, ఇరు పక్షాలు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుకు చెందినవే అయినప్పుడు కేసును ఢిల్లీలో ఎందుకు దాఖలు చేశారో తమకు అర్థం కావడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేసును చెన్నైకి బదిలీ చేయాలంటూ ప్రతివాదులు దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. వివిధ కోర్టులకు ప్రాదేశిక అధికార పరిధి ఉన్నంత మాత్రాన, పిటిషనర్లు తమకు నచ్చిన న్యాయస్థానాన్ని ఎంచుకునే 'ఫోరమ్ షాపింగ్' విధానాన్ని సమర్థించుకోలేరని తేల్చిచెప్పింది. ఇలాంటి చర్యలు దేశంలోని హైకోర్టుల మధ్య అంతరాలు ఉన్నాయనే తప్పుడు భావనను పెంచుతాయని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా మేధో సంపత్తి, వాణిజ్య వివాదాలను విచారించడానికి ఒక నిర్దిష్ట హైకోర్టు (ఢిల్లీ హైకోర్టు వంటివి) మాత్రమే అత్యుత్తమమైనదనే ఆలోచన పూర్తిగా తప్పు అని, అది తప్పుడు అవగాహనతో కూడుకున్నదని స్పష్టం చేసింది. వివాదం ఎక్కడైతే మొదలైందో, ఇరు పక్షాలు ఎక్కడైతే ఉన్నాయో ఆ ప్రాంతంలోని న్యాయస్థానాలే కేసులోని వాస్తవాలను సమగ్రంగా అర్థం చేసుకోగలవని కోర్టు అభిప్రాయపడింది. మద్రాస్ హైకోర్టుకు స్వయంగా సివిల్ విచారణ చేపట్టే ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ క్రమంలోనే సదరు కేసును తక్షణమే మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఇరు పక్షాల ప్రతినిధులు కోర్టుకు నేరుగా గానీ లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గానీ హాజరు కావచ్చని తెలిపింది. వాణిజ్య వివాదాల్లో ఢిల్లీ హైకోర్టును మాత్రమే ప్రాధాన్య వేదికగా భావించి ఇతర రాష్ట్రాల వారు సైతం అక్కడికే వెళ్లే పోకడలపై గతంలో ఢిల్లీ హైకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

రామమందిర విరాళాల లెక్కలు బయటపెట్టాలి..

న్యూఢిల్లీ: అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఆలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. విరాళాల సేకరణ, లెక్కింపు, బ్యాంకు ఖాతాల్లో జమ చేసే ప్రక్రియతో పాటు ఆలయ నిర్మాణ పనుల్లోనూ అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), బీజేపీ, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)కు చెందిన వ్యక్తుల పాత్రపైనా దర్యాప్తు జరగాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు.

ముందే ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదా?

2021లోనే ఆలయ విరాళాల లెక్కల్లో అవకతవకలు జరుగుతున్నాయని అప్పటి ఖాతాల అధికారి మహిపాల్ సింగ్ గుర్తించి, ట్రస్టు ప్రతినిధులు చంపత్ రాయ్, గోపాల్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు మీడియా కథనాలు వెల్లడించాయని జైరాం రమేశ్ పేర్కొన్నారు. అయితే అక్రమాలను ప్రశ్నించిన అధికారినే విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఇంజినీర్ దినానాథ్ వర్మ కూడా ట్రస్టు కార్యాలయంలో పనుల కోసం 40 శాతం కమీషన్ డిమాండ్ చేశారని ఆరోపించినట్లు జైరాం ప్రస్తావించారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌ను చంపత్ రాయ్‌కు వినిపించిన తర్వాత తననే ప్రాజెక్టు నుంచి తొలగించారని వర్మ చెప్పినట్లు మీడియా కథనాలను ఉటంకించారు. ఈ ఆరోపణలపై ట్రస్టు ప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని ప్రశ్నించారు.

కుల్గామ్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. కుల్గామ్ జిల్లాలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) శిబిరం సమీపంలోని చెక్‌పోస్టుపై బుధవారం దాడి చేశారు. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని వెంటనే అనంతనాగ్ జిల్లాలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మధ్యాహ్నం 2.15 గంటలకు కాల్పులు

అధికారుల వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం సుమారు 2.15 గంటల సమయంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కుల్గామ్‌లోని సీఆర్‌పీఎఫ్ నాకా వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై అకస్మాత్తుగా కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరపడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో 46వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

బిజినెస్

అంతెత్తున ఎగిసి ఆపై దిగి వచ్చి..

చివరికి లాభాలతోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. చమురు ధరల పతనం, ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు ఉదయం ఉరకలేశాయి. ఆ తర్వాత అమాంతం చతికిలపడ్డాయి. చివరకు కోలుకుని లాభాలతో ముగిశాయి. ఇవాళ్టి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 770 పాయింట్లకుపైగా లాభపడగా, నిఫ్టీ 25,200 మార్క్ పైన ముగిసింది. క్రితం సెషన్ ముగింపు (81,106.65) తో పోలిస్తే ఈ ఉదయం సెన్సెక్స్ దాదాపు 1100 పాయింట్ల లాభంతో 82,248.68 వద్ద ఉత్సాహంగా ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఒక దశలో 82,520 వద్ద ఎనిమిది నెలల గరిష్ఠస్థాయిని తాకింది. ఈ దశలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఐటీ, రియల్టీ షేర్లలో అమ్మకాలతో కుదేలైన సెన్సెక్స్.. 81,417 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. అంటే గరిష్ఠస్థాయి నుంచి దాదాపు 1000 పాయింట్లు తగ్గింది. చివరి సెషన్‌లో కోలుకున్న సూచీలు మార్కెట్ ముగిసే సమయానికి 772.75 పాయింట్లు పెరిగి 81,879 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 210 పాయింట్లు లాభపడి 25,255 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఎనిమిది పైసలు పెరిగి 93.69 గా స్థిరపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు సద్దుమణుగుతాయనే అంచనాలతో ముడిచమురు ధరలు దిగొచ్చాయి.

ఐపీవోకు 'హిందుస్తాన్ కోకకోలా'..

99.75 కోట్ల షేర్ల ఆఫర్



న్యూఢిల్లీ: గ్లోబల్ పానీయాల దిగ్గజం కోకకోలా కంపెనీ దేశీ బాట్లింగ్ బిజినెస్ హిందుస్తాన్ కోకకోలా హోల్డింగ్స్(హెచ్‌సీసీహెచ్) పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మా ర్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా విదేశీ ప్రమోటర్ కంపెనీ హిందుస్తాన్ కోకకోలా ఓవర్‌సీస్ హోల్డింగ్స్ పీటీఈ 99.75 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనుంది. వెరసి ఐపీవో నిధులు ప్రమోటర్లకు చేరనున్నాయి. దేశీ బాట్లింగ్ విభాగం హిందుస్తాన్ కోకకోలా బెవరేజెస్(హెచ్‌సీసీబీ)ను త్వరలో లిస్ట్ చేయనున్నట్లు మాతృ సంస్థ హెచ్‌సీసీహెచ్ ఈ ఏడాది జూన్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే.

అతిపెద్ద కంపెనీగా..

ఆదాయంరీత్యా 2025--26లో నాన్‌ఆల్కహాలిక్ రెడీ టు డ్రింక్ పానీయాల విభాగంలో హెచ్‌సీసీహెచ్ దేశీయంగా అతిపెద్ద కంపెనీగా నిలిచినట్లు టీకేసీ నివేదిక పేర్కొంది. దేశీ కోకకోలా వ్యవస్థలో అతిపెద్ద బాట్లర్‌గానూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేసింది. కంపెనీ కోక కోలాకు చెందిన విభిన్న పానీయాల ప్యాకేజింగ్, పంపిణీ, విక్రయాలను చేపడుతోంది. కోకకోలా ఓవర్‌సీస్ ద్వారా హెచ్‌సీసీహెచ్‌లో విదేశీ మాతృ సంస్థ కోకకోలా కంపెనీ 60 శాతం వాటాను కలిగి ఉంది.

బ్యాటరీ వ్యర్థాల ఎగుమతులపై నిషేధం



దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి నిల్వ వ్యవస్థల వినియోగం వేగంగా పెరుగుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ముందస్తు వర్గీకరణ చేయని (అన్‌సార్టెడ్) బ్యాటరీ వ్యర్థాలు, లిథియం-అయాన్ బ్యాటరీ బ్లాక్ మాస్ ఎగుమతులను తక్షణమే నిషేధిస్తూ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) అధికారిక ప్రకటన జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నిషేధం అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది.

మారిన ఎగుమతి విధానం

గతంలో ఐటీసీ (హెచ్‌ఎస్) కోడ్ కింద ఉన్న ప్రాథమిక సెల్స్, ప్రైమరీ బ్యాటరీలు, ఎలక్ట్రిక్ అక్యుములేటర్లు అలాగే వినియోగించిన బ్యాటరీల వ్యర్థాల ఎగుమతి విధానం 'స్వేచ్ఛ'(ఫ్రీ) జాబితాలో ఉండేది. అయితే, ఎలాంటి సీసం (లెడ్), కాడ్మియం లేదా పాదరసం లేని, వర్గీకరించని బ్యాటరీ స్క్రాప్, లిథియం-అయాన్ బ్యాటరీ బ్లాక్ మాస్‌ను ఇప్పుడు నిషేధిత జాబితాలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల దేశీయ ఎగుమతిదారులు ఇకపై ఈ నిర్దిష్ట వ్యర్థాలను విదేశాలకు తరలించడానికి వీలు ఉండదు.

ఈ నిర్ణయం వెనుక కారణం

లిథియం-అయాన్ బ్యాటరీల రీసైక్లింగ్ ద్వారా లభించే బ్లాక్ మాస్‌లో లిథియం, కోబాల్ట్, నికెల్, మాంగనీస్ వంటి విలువైన ఖనిజాలు ఉంటాయి. సరిగ్గా ఇటువంటి కీలక ఖనిజాల సంపద దేశం దాటిపోకుండా అడ్డుకోవడమే ఈ నిషేధం ప్రధాన ఉద్దేశం. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇది పెద్దపీట వేస్తుంది. దేశంలో తయారయ్యే లేదా సేకరించే బ్యాటరీ వ్యర్థాలు ఇక్కడి రీసైక్లింగ్ యూనిట్లకే అందేలా చూడటం ద్వారా సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

వ్యాపారం పెరిగినా లేఆఫ్‌లే..
1,000 ఉద్యోగాలపై కోతవేసిన పెప్సీకో



ఇంటర్నెట్‌డెస్క్: శీతలపానీయ దిగ్గజ సంస్థ పెప్సీకో తాజాగా 1,000 ఉద్యోగాలను తగ్గించుకోవాలని నిర్ణయించింది. తన ఉత్తర అమెరికా వ్యాపార కార్యకలాపాలను క్రమబద్ధీకరించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు కంపెనీ చెబుతోంది. వాస్తవానికి ఈ సంస్థ ఐరోపా, మధ్య ఆఫ్రికా వ్యాపారం ఈ త్రైమాసికంలో 5.41 బిలియన్ డాలర్లు వృద్ధి చెందినా.. ఈ నిర్ణయం తీసుకొంది. వ్యాపార అభివృద్ధి, ఆపరేషనల్ సామర్థ్యం పెంపొందించడానికి ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. పెప్సీకోలో ఇలియాట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ 2025లో వాటాలు కొనుగోలు చేసిన తర్వాత పునర్‌వ్యవస్థీకరణ వేగవంతమైంది.

క్వాల్‌కామ్‌లో చర్యలు మొదలు

ఇప్పటికే ఉద్యోగులకు లేఆఫ్‌లు ఉంటాయని అక్టోబర్‌లో ప్రకటించిన క్వాల్‌కామ్ సంస్థ ఆ దిశగా చర్యలు చేపట్టింది. దీంతో ప్రపంచంలోని వివిధ దేశాల్లోని ఆ సంస్థ ఉద్యోగులు ప్రభావితం కానున్నారు. దీనికి సంబంధించి వీడ్కోలు ప్యాకేజీని ప్రకటించింది. మొదట దీనికి అంగీకరించి.. ఎగ్జిట్ పత్రాలపై సంతకం చేసిన ఉద్యోగులు అదనపు మొత్తం అందుకొంటారని వెల్లడించింది. ఇక ప్రకటించిన ప్యాకేజీ ప్రకారం రెండువారాల స్థూల వేతనం, మిగిలిన సర్వీసులో ప్రతి ఏడాదికి రెండు వారాల అదనపు వేతనం, మిగిలిన సర్వీసుకు ముందుగా లెక్కగట్టిన పరిహారం, హెల్త్‌కవరేజీకి ఏకమొత్తంలో చెల్లింపులు వంటి అంశాలున్నాయి. ఈ సారి లేఆఫ్‌ల్లో ఎన్ని ఉద్యోగాలు ప్రభావితం అవుతాయో కచ్చితంగా వెల్లడించలేదు. తొలుత భారత్‌లో 1,000 ఉద్యోగాలపై ప్రభావం పడొచ్చని భావించినా.. ఇప్పుడు ఆ సంఖ్య తక్కువగానే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. క్వాల్‌కామ్‌కు ప్రపంచ వ్యాప్తంగా 52,000 మంది ఉద్యోగులున్నారు.

'శ్రేయస్.. నీ వెనక నేనున్నా'..
పంజాబ్‌కు మారిన తర్వాత హార్దిక్ ఫస్ట్ రియాక్షన్

ట్రేడ్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు మారిన హార్దిక్

కెప్టెన్, కోచ్, జట్టు, మొత్తం పంజాబ్‌కు అండగా ఉంటానని వ్యాఖ్య

తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో టీమ్‌కు మద్దతుగా ఉంటానని సంకేతం

అతడి స్థానంలో ముంబై ఇండియన్స్‌లో చేరనున్న అర్ష్‌దీప్



ఐపీఎల్‌లో కీలక ఆటగాళ్ల ట్రేడింగ్ వ్యవహారం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి మారనున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బలమైన సందేశం పంపించాడు. కెప్టెన్ శ్రేయస్, కోచ్ రికీ పాంటింగ్ సహా పంజాబ్ జట్టు మొత్తానికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశాడు. పంజాబ్ జెర్సీతో ఉన్న ఫొటోను కూడా పంచుకున్నాడు. రెండుసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్‌తో కలిసి పనిచేయడం పట్ల హార్దిక్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు.. పంజాబ్ మొత్తం.. మీ వెనక నేనున్నా' అంటూ పోస్ట్ చేశాడు. తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో జట్టుకు ఉపయోగపడతాననే సంకేతాలిచ్చాడు. ఐపీఎల్ చరిత్రలోనే కీలకమైన ఆటగాళ్ల మార్పిడిలో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు హార్దిక్ వెళ్లనున్నాడు. అతడి స్థానంలో భారత టీ20 బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరనున్నాడు. ఈ ట్రేడింగ్‌లో హార్దిక్ పారితోషికం రూ.16.35 కోట్ల నుంచి రూ.18 కోట్లకు పెరగనుంది. అర్ష్‌దీప్ మాత్రం తన ప్రస్తుత రూ.18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టుకు మారనున్నాడు. హార్దిక్‌కు ముంబై ఇండియన్స్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2015లో ఆ జట్టులో చేరిన అతడు 2015, 2017, 2019, 2020 సీజన్లలో టైటిళ్లు గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఏడు సీజన్ల తర్వాత గుజరాత్ టైటాన్స్‌కు మారి, తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా టైటిల్ అందించాడు. 2023లోనూ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2024లో తిరిగి ముంబైకి వచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. మొత్తం 162 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో హార్దిక్ 2,955 పరుగులు చేయడంతోపాటు 82 వికెట్లు పడగొట్టాడు. అయితే ముంబైతో రెండో విడత మూడేళ్ల ప్రయాణంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. 39 మ్యాచ్‌ల్లో 647 పరుగులు, 29 వికెట్లు సాధించాడు. అతడి కెప్టెన్సీలో ముంబై 2025లో ప్లేఆఫ్స్‌కు చేరగా, 2024, 2026 సీజన్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. మరోవైపు అర్ష్‌దీప్ 2019లో పంజాబ్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఆ జట్టు తరఫున 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. 2025 సీజన్‌లో 21 వికెట్లు, 2026లో 14 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంతోపాటు డెత్ ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

మ్యూజియానికి సచిన్ 26 బ్యాట్లు..
నవంబర్ 16న 'బ్యాటోగ్రఫీ'



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో ఉపయోగించిన 26 బ్యాట్లను ముంబై క్రికెట్ సంఘానికి (ఎంసీఏ) బహూమతిగా ఇవ్వనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో చారిత్రక ఘనతలు సాధించేందుకు ఉపయోగించిన బ్యాట్లతో పాటు హెల్మెట్లు, జెర్సీలు, కీలక సందర్భాలకు సంబంధించిన వ్యక్తిగత నోట్లను కూడా ఎంసీఏకు అందించనున్నారు. వీటిని ముంబైలోని శరద్ పవార్ క్రికెట్ మ్యూజియంలో ప్రత్యేక విభాగంలో ప్రదర్శించనున్నారు. 'బ్యాటోగ్రఫీ' పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రదర్శనను నవంబర్ 16న ప్రారంభించనున్నారు. సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి 13 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రదర్శనను ప్రారంభించడం విశేషం. 2013 నవంబర్‌లో ముంబై వాంఖడే స్టేడియంలో వెస్టిండీస్‌తో తన 200వ టెస్టు ఆడిన సచిన్.. అదే మ్యాచ్‌తో అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికారు. సచిన్ క్రికెట్ ప్రయాణాన్ని ఆయన ఉపయోగించిన బ్యాట్ల ద్వారా పరిచయం చేయడమే 'బ్యాటోగ్రఫీ' ఉద్దేశం. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు సాధించిన చారిత్రక ఘనతకు తోడ్పడిన బ్యాట్లు కూడా ఇందులో ఉండనున్నాయి. వాటి వెనుక ఉన్న విశేషాలను తెలుసుకునే అవకాశం అభిమానులకు లభించనుంది. ఈ కార్యక్రమంపై ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ మాట్లాడుతూ.. భారత, ప్రపంచ క్రికెట్‌కు సచిన్ అందించిన సేవలు రికార్డులకు మాత్రమే పరిమితం కావని అన్నారు. కోట్లాది మంది అభిమానుల జ్ఞాపకాల్లో ఆయన ప్రయాణం భాగమైందని పేర్కొన్నారు. సచిన్ తన విలువైన జ్ఞాపికలను మ్యూజియానికి అందించడం గౌరవంగా భావిస్తున్నామని, తద్వారా భవిష్యత్ తరాల క్రికెట్ అభిమానులు ఆయన ఘనతలను మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రదర్శన ద్వారా సచిన్ కెరీర్‌లోని కీలక ఘట్టాలను, వాటితో ముడిపడిన జ్ఞాపకాలను భద్రపరచడంతో పాటు అభిమానులకు వాటిని ప్రత్యక్షంగా చూసే అవకాశం కలగనుంది.

స్పోర్ట్స్

పురుష క్రికెటర్లతో సమానంగా మమ్మల్నీ గుర్తించండి: పాక్ కెప్టెన్ ఫాతిమా సనా

పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్ కు ఆదరణ దక్కాలన్న ఫాతిమా సనా

డబ్ల్యూబీబీఎల్‌లో పెర్త్ స్కార్చర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సనా

ఈ లీగ్‌లో ఆడుతున్న రెండో పాకిస్థాన్ మహిళా క్రికెటర్

2028 టీ20 వరల్డ్ కప్‌తో పెను మార్పులు ఖాయమన్న ఆశాభావం

మెగా టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాక్



పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్‌కు కూడా గుర్తింపు, ఆదరణ దక్కాలని ఆ దేశ మహిళల జట్టు కెప్టెన్ ఫాతిమా సనా ఆకాంక్షను వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ (బెదీదీ)లో పెర్త్ స్కార్చర్స్ జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫాతిమా సనా మాట్లాడుతూ, మహిళల క్రికెట్‌లో సమగ్ర మార్పు రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు స్టేడియాలు కిక్కిరిసిపోవడం, మీడియా నుంచి విపరీతమైన ప్రచారం లభించడం సర్వసాధారణమని, సరిగ్గా అలాంటి వాతావరణం, ఉత్సాహం మహిళల మ్యాచ్‌లకు కూడా దక్కాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ఫాతిమా సనా పేర్కొంది. మైదానంలో మహిళా క్రికెటర్లు సైతం పూర్తి స్థాయిలో శ్రమిస్తున్నారని, వారికి కూడా సమాన స్థాయిలో అభిమానుల మద్దతు అవసరమని ఆమె అభిప్రాయపడింది. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం 15 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం సాధించి ప్రపంచ రికార్డు సృష్టించిన ఫాతిమా సనా, మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అడుగుపెట్టిన రెండో పాకిస్థానీ క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో 2019లో నిదా దార్ ఈ లీగ్‌లో ఆడగా, మళ్లీ ఇన్నాళ్లకు ఫాతిమాకు ఈ అవకాశం లభించింది. డబ్ల్యూబీబీఎల్ వంటి నాణ్యమైన అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయని, తన అనుభవం భవిష్యత్తులో మరింత మంది పాకిస్థానీ అమ్మాయిలు విదేశీ లీగ్‌లకు ఎంపికయ్యేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. మరోవైపు, 2028లో జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుండటంపై ఫాతిమా సనా స్పందిస్తూ.. ఈ మెగా ఈవెంట్ దేశంలో మహిళల క్రీడారంగానికి ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని చెప్పింది. సొంత గడ్డపై ప్రపంచకప్ నిర్వహించడం ద్వారా స్థానిక బాలికల్లో క్రికెట్ పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని, మహిళల క్రికెట్‌ను చూసే దృక్పథంలోనూ స్పష్టమైన మార్పు వస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. క్రీడారంగంలో లింగ సమానత్వం దిశగా అడుగులు పడటానికి ఇలాంటి భారీ టోర్నీలు దోహదపడతాయని ఫాతిమా సనా స్పష్టం చేసింది.

సంపాదకీయం

సమాధానమే సరైన దారి!

దేశంలో ఇటీవల కనిపిస్తున్న విద్యార్థి నిరసనలను ఒక్కసారిగా పుట్టిన అసంతృప్తిగా చూడటం పొరపాటు. ఏళ్ల తరబడి పేరుకున్న ఫిర్యాదులపై ఉద్యమం నిలబడిందన్న వాదన వాస్తవం. ప్రజాస్వామ్యానికి ముప్పుందని భావిస్తే.. ముందుగా స్పందించేది విద్యార్థులే. 2015లో పుణే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు గజేంద్ర చౌహాన్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ 139 రోజుల పాటు నిరసన తెలిపారు. తర్వాత రోహిత్ వేముల ఘటనపై ఉద్యమం, జేఎన్‌యూ విద్యార్థులపై రాజద్రోహం కేసులపై నిరసనలు, నజీబ్ అహ్మద్ అదృశ్యంపై ప్రశ్నలు, వివిధ విశ్వవిద్యాలయాల్లో ఫీజుల పెంపుపై ఆందోళనల నుంచి 2012 నిర్భయ ఉద్యమం వరకూ యువత సామాజిక సమస్యలపై ఎంతగా స్పందిస్తారో చూడొచ్చు. పాలకులు ఇలాంటి నిరసనలను 'దేశ వ్యతిరేకం' అని కొట్టిపారేయడం సులువే. కానీ అలా చేస్తే సమస్య పరిష్కారం కాదని, అది రూపం మార్చుకుని మళ్లీ వస్తుందని చరిత్ర చెబుతోంది. 2026లో అలాంటి రూపమే.. వీధికెక్కిన సీజేపీ వ్యంగ్య యువ ఉద్యమం. జూన్ 6న వేలాదిగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేరారు. జూన్ 28న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షతో ఉద్యమానికి నైతిక బలం వచ్చింది. జూలై 20న పార్లమెంటు వైపు జరిగిన ప్రదర్శన ఘర్షణగా మారింది. జూలైలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఇది ఉద్యమానికి దక్కిన పెద్ద విజయమన్నది విశ్లేషకుల మాట. అయితే అధికార బీజేపీ మాత్రం, నిజమైన విద్యార్థి ఉద్యమాన్ని ప్రతిపక్షాలు రాజకీయ లాభం కోసం స్వాధీనం చేసుకున్నాయని ఆరోపించింది. ఈ వాదనలకు -కాలమే సమాధానమివ్వాలి.

ఈ తరం నిరసనల తీరులో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. జెన్ జీ యువత మీమ్స్, రీల్స్, వ్యంగ్యం, చమత్కారాన్నే రాజకీయ భాషగా మార్చుకుంది. నిరసన స్థలం కూడా వీడియోలు తీసే వేదికైంది. ఇన్‌స్టాగ్రామ్, రెడిట్, యువత నడిపే యూట్యూబ్ ఛానళ్లు రాజకీయ చర్చకు కొత్త చోటయ్యాయి. అయితే, దీన్ని "జెన్ జీ"గా ముద్ర వేసి చూడటం సరికాదన్నది విశ్లేషకుల హెచ్చరిక. ఆ పదం ఒక మార్కెటింగ్ వర్గీకరణేనని, అసలు సమస్యలు నిరుద్యోగం, పరీక్షల అవినీతి వంటివని వారి వాదన. ఈ ఉద్యమం ఇప్పుడు -ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పైకి బాణం ఎక్కుపెట్టింది. బిహార్‌లో 2025 జూన్‌లో మొదలైన ఈ ప్రక్రియ ఇప్పుడు 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరించింది. ఈ సవరణ వల్ల 13 కోట్లకు పైగా పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగిపోయాయని నిరసనకారులు అంటున్నారు. అయితే ఎన్నికల సంఘం ఈ లెక్కను వివాదాస్పదంగా చెబుతోంది. జాబితాల కచ్చితత్వం కోసమే సవరణ చేస్తున్నామని, ఎలాంటి అక్రమాలు జరగలేదని, నిర్ణయాలన్నీ కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్నాయని వాదిస్తోంది. అయినా కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ వాడకం, స్థానిక అధికారులకు పరిమిత అధికారాలు వంటి అంశాలపై విమర్శలు ఆగలేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ విద్యార్థి సంఘాలు, వామపక్షాలు, కాంగ్రెస్ అనుబంధ విభాగాలు, రైతు సంఘాలు వేర్వేరు చోట్ల ప్రదర్శనలు చేశాయి. యువత ఆశలు, అసంతృప్తులకు ఎన్నికలే ప్రధాన వేదిక. ఆ ఎన్నికల వ్యవస్థపైనే నమ్మకం తగ్గితే, శాంతియుత నిరసనే వారికి మిగిలే మార్గమని ఉద్యమకారులు అంటున్నారు. ఈ క్రమంలో పోలీసు చర్యలపై విమర్శలు పెరిగాయి. అక్టోబర్ 16న 'లెహరా దో తిరంగా' యాత్ర సందర్భంగా ఏఐఎన్ఏ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిపకేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత నేహా బోరాకు శాంతి భద్రతల బాండు (పీస్ బాండ్) ఇవ్వాలని బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126 కింద నోటీసు వచ్చింది. రూ.10,000 వ్యక్తిగత పూచీకత్తు, ఒక హామీదారు కావాలని అందులో ఉంది. ఢిల్లీ హైకోర్టు ఆమె పిటిషన్‌ను కొట్టేసినా, ఆమెకు సంబంధిత పత్రాలన్నీ ఇవ్వాలని మేజిస్ట్రేట్‌కు ఆదేశాలిచ్చింది. అయినా తాను సంతకం చేయనని ఆమె స్పష్టం చేశారు. "ఎవరి శాంతిని నేను కాపాడాలి?" అని ప్రశ్నించారు. ఇది శాంతియుత నిరసన హక్కును అణచివేసే సాధనంగా మారుతోందని ఆమె ఆరోపించారు. అయితే పోలీసులు తమ వాదన వేరుగా వినిపించారు. కొందరు నిరసనకారులు విధుల్లోని సిబ్బందిపై దాడి చేశారని చెబుతున్నారు. నిషేధాజ్ఞలు ఉన్నా పదే పదే ప్రదర్శనలు జరిగాయని అంటున్నారు.

ఈ వివాదంలో తాజా మలుపు జంతర్‌మంతర్ వద్దే వచ్చింది. దశాబ్దాలుగా రైతులు, కార్మికులు, విద్యార్థులు తమ గళాన్ని వినిపించే చోటుగా ఉన్న ఆ ప్రదేశాన్ని అక్టోబర్ 11న ఢిల్లీ పోలీసులు నిర్దేశిత నిరసన స్థలంగా రద్దు చేశారు. కేంద్ర హోం శాఖ కమిటీ సిఫార్సులు, భద్రతా కారణాలు, సమీపంలోని రాయబార కార్యాలయాలు వంటివి దీనికి కారణాలుగా చెప్పారు. ఇరుకైన వారసత్వ ప్రాంతం కావడంతో మెరుగైన వసతులున్న స్థలం చూడాలని సుప్రీంకోర్టు సూచనను కూడా పోలీసులు ప్రస్తావించారు. దాని బదులు రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు చోట్లను ప్రకటించారు. ప్రభుత్వ వాదనలో కొంత నిజం ఉంది. నెలల తరబడి కొనసాగిన ఆందోళనలతో న్యూఢిల్లీ ప్రాంతంలో రాకపోకలు స్తంభించాయి, స్థానిక వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. ప్రజా శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత కూడా. కానీ విమర్శకుల ప్రశ్న మరో కోణంలో ఉంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గళం చేరాల్సింది అధికార కేంద్రం దగ్గరే. అందుకే నిరసనకు చోటు ఇవ్వమని అడిగితే ఉన్న చోటునే తొలగించడం సరైన సందేశం కాదని వారు అంటున్నారు. రాజ్యాంగం శాంతియుత సమావేశ హక్కును ఇస్తుంది, దానిపై న్యాయబద్ధమైన పరిమితులూ ఉంటాయి. ఈ రెండింటి మధ్య సమతూకం కుదరాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులు, కోర్టులపై ఉంది. ఉద్యమకారులు కూడా శాంతియుత మార్గాన్ని విడవకూడదు, ఘర్షణలకు తావివ్వకూడదు. వాదనలు ఎలా ఉన్నా, ఇన్ని నెలలుగా వీధుల్లో కనిపిస్తున్న యువత ఒక వాస్తవాన్ని గుర్తు చేస్తోంది. ఉద్యోగాలు, పరీక్షల పారదర్శకత, ఓటు హక్కుపై నమ్మకం.. ఇవి నేటి తరం ఆందోళన. లాఠీలు, కేసులు, బాండ్లతో ఈ గళాన్ని కొంతకాలం తగ్గించవచ్చు, కానీ సమస్యలు తీరకపోతే అవి మరో రూపంలో తిరిగి వస్తాయి. పేపర్ లీకులకు గట్టి చట్టపరమైన పరిష్కారం, ఓటర్ల జాబితాల తొలగింపులపై పారదర్శకత, నిరసనకారులతో సంభాషణ.. ఇవే ప్రభుత్వం ముందున్న మార్గాలు. యువత హాస్యంతో, ఆశతో ప్రశ్నిస్తోంది. ఆ ప్రశ్నలకు సమాధానమివ్వడమే ప్రజాస్వామ్యాన్ని బలపరిచే దారి.

ఐజెన్‌కోట్‌కు అసలు పరీక్ష

ఇజ్రాయెల్ రాజకీయాలు మరో కీలక మలుపు తిరిగాయి. అక్టోబర్ 27న జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏ శిబిరానికీ స్పష్టమైన మెజార్టీ రాలేదు. 120 మంది సభ్యుల పార్లమెంటు 'నెసెట్'లో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సింది 61 మంది మద్దతు. ఫలితాల ప్రకారం ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నాయకత్వంలోని లికుడ్ పార్టీకి సుమారు 27 స్థానాలు, మాజీ సైనిక దళాల అధిపతి గాడీ ఐజెన్‌కోట్ నేతృత్వంలోని 'యషార్' పార్టీకి 21 స్థానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ఐజాక్ హెర్జాగ్ వివిధ పార్టీలతో చర్చలు జరిపారు. నవంబర్ 7, 8 తేదీల్లో ఆయన ప్రభుత్వం ఏర్పాటు బాధ్యతను ఐజెన్‌కోట్‌కు అప్పగించారు. ఐజెన్‌కోట్‌ను 67 మంది సభ్యులు సిఫార్సు చేయగా, నెతన్యాహుకు 46 మంది మాత్రమే మద్దతు ఇచ్చారు. ఏడుగురు సభ్యుల ఒక పార్టీ ఎవరినీ సిఫార్సు చేయలేదు. కూటమి ఏర్పాటుకు ఐజెన్‌కోట్‌కు 28 రోజుల గడువుంది. అవసరమైతే మరో 14 రోజులు పొడిగించవచ్చు. ఇది నెతన్యాహుకు పెద్ద ఎదురుదెబ్బే. ఇజ్రాయెల్ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఆయన ఇంకా ఓటమిని అంగీకరించలేదు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, అరబ్ పార్టీలకు విదేశీ నిధులు అందాయని ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు బహిరంగంగా రుజువులు చూపలేదని వార్తా సంస్థలు చెబుతున్నాయి. ఆయన విశాల 'జాతీయ ఐక్య ప్రభుత్వం' ఆలోచనను ముందుకు తెస్తున్నారు. ఈ పరిణామాన్ని అరబ్ దేశాల టీవీ చానళ్లు ప్రముఖంగా ప్రసారం చేశాయి. అల్ జజీరా, అల్ అరేబియా, స్కై న్యూస్ అరేబియా వంటి చానళ్లు ఐజెన్‌కోట్ ముందున్న రాజకీయ సవాళ్లపై లోతైన విశ్లేషణలు ఇచ్చాయి. ఇరాన్ అనుకూల చానళ్లు కూడా తమ దృష్టికోణంలో స్పందించాయి. ఈ అరబ్ చానళ్ల ఆసక్తికి కారణం ఉంది. ఈసారి ఇజ్రాయెల్‌లోని అరబ్ పార్టీలు 19 స్థానాలు గెలుచుకున్నాయని నివేదికలు చెబుతున్నాయి. అందుకే ఈ ప్రభుత్వ ఏర్పాటులో వారి పాత్ర కీలకం.

అయితే ఐజెన్‌కోట్ ముందున్న దారి సులువు కాదు. ఆయనకు సిఫార్సు చేసిన 67 మందిలో అరబ్ పార్టీల సభ్యులు ఉన్నారు. కానీ ఆయన కూటమి ప్రభుత్వంలో అరబ్ పార్టీలను చేర్చుకోబోనని ముందే స్పష్టం చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. దాంతో ఆయన ముందు మూడు మార్గాలు కనిపిస్తున్నాయి. మొదటిది, అరబ్ పార్టీల బయటి మద్దతుతో మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు. 'జాయింట్ లిస్ట్' నాయకుడు అహ్మద్ తిబీ ఇదే సూచిస్తున్నారు. నెతన్యాహు ప్రభుత్వాన్ని దించడమే ప్రధాన లక్ష్యం కావాలని, దానికి 'రాజకీయ ధైర్యం' అవసరమని అన్నారు. మన్సూర్ అబ్బాస్ నేతృత్వంలోని యునైటెడ్ అరబ్ లిస్ట్ (రాఅమ్) అధికారిక ఒప్పందం లేకపోయినా మద్దతివ్వడానికి సిద్ధంగా ఉందని అల్ అరేబియా చానల్ పేర్కొంది. అబ్బాస్ ఇప్పటికే ఐజెన్‌కోట్‌తో, ప్రతిపక్ష నేత యాయిర్ లాపిడ్‌తో చర్చలు జరిపారని ఆ చానల్ చెప్పింది. 2021లో ఏర్పడిన నఫ్తాలీ బెన్నెట్-లాపిడ్ ప్రభుత్వంలో ఈ పార్టీ భాగమైన సంగతి గుర్తు చేసుకోవాలి. రెండో మార్గం, కఠిన సంప్రదాయవాద యూదు పార్టీలతో ఒప్పందం చేసుకోవడం. మూడోది, నెతన్యాహు శిబిరంలోని కొన్ని వర్గాలను కలుపుకుని 'జాతీయ ఐక్య ప్రభుత్వం' ఏర్పాటు చేయడం. కానీ ప్రతి మార్గంలోనూ ముళ్లున్నాయి. ప్రతిపక్ష నేత అవిగ్డోర్ లీబర్‌మన్ అరబ్ పార్టీల ఓట్లపై ఆధారపడే ఎలాంటి ప్రభుత్వాన్నీ వ్యతిరేకిస్తున్నారని స్కై న్యూస్ అరేబియా చానల్ గుర్తు చేసింది. హమాస్ విషయంలో అబ్బాస్ వైఖరి కూడా కొంత వివాదాస్పదమైందని కొన్ని ఇజ్రాయెలీ నివేదికలు అంటున్నాయి. మైనారిటీ ప్రభుత్వం సాధ్యం కావాలంటే, అరబ్ పార్టీలతో పాటు కొన్ని మతపరమైన పార్టీలు ఓటింగ్‌కు దూరంగా ఉండాలని విశ్లేషకుడు ఇస్మత్ మన్సూర్ వివరించారు. నెతన్యాహు రాజకీయ ఎత్తులతో లేదా భద్రతా ఉద్రిక్తతలతో ఈ ప్రక్రియను అడ్డుకోకముందే త్వరగా కూటమి ఏర్పాటు చేయాలన్నది ఆయన సలహా. ఇదంతా సిద్ధాంత విభేదాలను పక్కన పెట్టి, 'నెతన్యాహును తొలగించడం' అనే ఒకే లక్ష్యంతో విభిన్న శక్తులు కలవగలవా? అనే ప్రశ్నకు సమాధానం వెతుకుతోంది. ఈ చర్చలో ఇంకో సున్నితమైన కోణం ఉంది. అరబ్ సమాజంపై నెతన్యాహు పదేపదే చేస్తున్న వ్యాఖ్యలను ఇరాన్ అనుకూల చానళ్లు ప్రస్తావించాయి. అరబ్ పార్టీలు ఐజెన్‌కోట్ ప్రభుత్వానికి మద్దతిస్తే అవి దేశాన్ని 'లోపలి నుంచే నాశనం చేస్తాయి' అని నెతన్యాహు గతంలో అన్నట్లు వాటి కథనం. దానికి ప్రతిగా నెతన్యాహు సమాజంలో విభజనలు సృష్టిస్తున్నారని ఐజెన్‌కోట్ ఆరోపించారు. ఇజ్రాయెలీ పౌరులైన అరబ్బులు 'విధేయతా పరీక్ష' ఎదుర్కొంటున్నారని కొన్ని విశ్లేషణలు అంటున్నాయి. అరబ్ పౌరులు ఓటు వేసింది మార్పు కోసమే, వారి ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని అబ్బాస్ భావిస్తున్నారని కథనాలు చెబుతున్నాయి.

ఈ రాజకీయ సందిగ్ధతకు అంతర్జాతీయ నేపథ్యం కూడా తోడైంది. నవంబర్ 3న, అంటే అమెరికా మధ్యంతర ఎన్నికల రోజున, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్‌కు ఏటా ఇస్తున్న సుమారు 4 బిలియన్ డాలర్ల సహాయాన్ని ఈ ఏడాది తర్వాత నిలిపివేస్తామని చెప్పారు. ఇది తాను, నెతన్యాహు కుదుర్చుకున్న ఒప్పందమని, అయితే ఆయుధాల అమ్మకాలు కొనసాగుతాయన్నారు. ఇరాన్ అనుకూల చానల్ అల్-ఆలం దీన్ని అమెరికా 'నెతన్యాహుకు దూరమవుతోంది' అన్న కోణంలో చూపింది. కానీ అసలు ప్రకటన స్వరం వేరు. ఇది నెతన్యాహుతో కలిసి తీసుకున్న నిర్ణయమని ట్రంప్ చెప్పారు. నెతన్యాహు కూడా గతంలో అమెరికా సైనిక సహాయాన్ని క్రమంగా తగ్గించుకునే అవసరం గురించి బహిరంగంగా మాట్లాడిన సంగతి ఉంది. ఆ ప్రకటనపై అనేక సందేహాలున్నాయి. ఒబామా కాలంలో 2016లో కుదిరిన ఒప్పందం ప్రకారం ఏటా 3.8 బిలియన్ డాలర్ల సహాయం 2028 వరకు ఉంది. అలాగే సహాయ నిధులను కాంగ్రెస్ మంజూరు చేస్తుంది, అధ్యక్షుడు ఒక్కరే నిర్ణయించలేరు. అందువల్ల నిపుణులు ఈ కోత గడువు ప్రకారం పూర్తిగా అమలవుతుందా? అని ప్రశ్నిస్తున్నారు. అమెరికా కాంగ్రెస్ ఇప్పుడు డెమోక్రాట్ల చేతిలోకి వెళ్లింది. అక్కడి డెమోక్రాట్లలో చాలామంది సైనిక సహాయంపై షరతులు పెట్టాలనే వైఖరితో ఉన్నారు. కాబట్టి ఇజ్రాయెల్ కొత్త ప్రభుత్వం ఎవరి చేతిలోవున్నా, అమెరికాతో సంబంధాల స్వభావం మారే అవకాశాలు ఎక్కువే. ఈ పరిణామాలన్నీ ఇజ్రాయెల్‌కు కీలక సమయంలో వచ్చాయి. గాజా, లెబనాన్, ఇరాన్ చుట్టూ ఉన్న ఉద్రిక్తతల నీడలో దేశం రాజకీయంగా తీవ్రంగా చీలిపోయి ఉంది. భద్రతా సవాళ్ల మధ్య స్థిరమైన ప్రభుత్వం కావాలని ప్రజలు కోరుకుంటారు. కానీ ఏ ప్రభుత్వం ఏర్పడినా అది సులువుగా నిలబడే పరిస్థితి కనిపించడం లేదు. ఐజెన్‌కోట్ గడువులోగా అవసరమైన మద్దతు కూడగట్టలేకపోతే, అధ్యక్షుడు మరొకరికి అవకాశం ఇవ్వవచ్చు. ఆ అవకాశం మళ్లీ నెతన్యాహుకు రావచ్చు. అన్ని ప్రయత్నాలూ విఫలమైతే నెసెట్ రద్దయి మళ్లీ ఎన్నికలు జరుగుతాయి. అంటే రాబోయే కొన్ని వారాలు ఇజ్రాయెల్ ప్రజాస్వామ్యానికి పరీక్షా కాలం. భిన్న శక్తులను ఒకే గొడుగు కిందికి తెచ్చే సామర్థ్యం ఐజెన్‌కోట్‌కు ఉందా, సైద్ధాంతిక విభేదాలను పక్కన పెట్టడానికి ప్రతిపక్షాలు సిద్ధమా, నెతన్యాహు తన రాజకీయ అనుభవంతో ఈ ప్రక్రియను అడ్డుకోగలరా.. వీటికి సమాధానాలు త్వరలో తెలుస్తాయి. ఏదేమైనా, పౌరులందరి ఓటుకు విలువ ఇచ్చే వ్యవస్థను నిలబెట్టుకోవడమే పరీక్షలో అసలైన విజయం! ■



పనికొచ్చే పలుకు



నా కోసమే నేను

ఒక నాటక రిహార్సల్ హాల్. దర్శకుడు నటులందరినీ ఒక ప్రశ్న అడిగారు: "మీరు ఎవరి కోసం నటిస్తున్నారు?" కొందరు "అమ్మ కోసం" అన్నారు, కొందరు "కుటుంబం కోసం" అన్నారు. చివరగా ఒక యువ నటి లేచి, "నిజం చెప్పాలంటే, నా కోసమే నటిస్తున్నాను" అని చెప్పింది. గదిలో నిశ్శబ్దం. తర్వాత అందరి మెప్పు. ఆమె కేట్ విన్స్‌లెట్ అని, తన కెరీర్ తొలి రోజుల్లో జరిగిన సంఘటనగా ఆమె ఒక ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారని వార్తలు చెబుతున్నాయి. టైటానిక్‌తో ప్రపంచానికి తెలిసిన ఈ నటి ఆస్కార్, ఎమ్మీ, బాఫ్టా, గోల్డెన్ గ్లోబ్, గ్రామీవంటి పురస్కారాలు అందుకున్నారు.

ఈ మాట వెనుక ఉన్న విశ్లేషణ

"అందరినీ ఎప్పుడూ సంతృప్తి పరచడం ఎవరికీ సాధ్యం కాదు" అనే ఆమె భావనలో ఒక లోతైన సత్యం ఉంది. మనం చేసే చాలా పనులు నిజానికి ఎవరో ఒకరి మెప్పు కోసమే. బంధువులు ఏమంటారో, సోషల్ మీడియాలో ఎంతమంది లైక్ చేస్తారో, ఆఫీసులో మేనేజర్ ఏం అనుకుంటారో అని మనం ఆలోచిస్తూ జీవిస్తాం. ఇక్కడ ఒక ప్రమాదం ఉంది. మెప్పు కోసం చేసిన పని విఫలమైతే నింద ఇతరులపైకి వెళ్తుంది. "వాళ్లే కారణం" అన్న భావన పెరిగి, మనం ఏమీ నేర్చుకోలేం. కానీ మన కోసం మనం చేసిన పని విఫలమైతే, బాధ్యత మనదే అన్న అవగాహన వస్తుంది. అదే మెరుగుదలకు మొదటి మెట్టు. కేట్ చెప్పిన "స్వీయ బాధ్యతే స్వేచ్ఛ" అంటే ఇదే.

మీ జీవితంలో ఎలా అమలు చేయాలి?

ప్రతి పనికి ముందు ఒక ప్రశ్న వేసుకోండి. "ఇది నేను ఎవరి కోసం చేస్తున్నాను?" సమాధానం "నా లక్ష్యం కోసం" అయితే ముందుకు వెళ్లండి. "ఎవరో ఏమనుకుంటారో అని" అయితే ఒక్క నిమిషం ఆగండి.

విఫలమైనప్పుడు ఒక్క వాక్యం రాయండి. "ఈసారి నేను ఏం మార్చి ఉండాలి?" అని. కారణాలను ఇతరులపై కాకుండా మీ చేతుల్లో ఉన్న వాటిపై వెతకండి.


ఇతరుల అభిప్రాయాలను వడపోయండి. అందరి మాటలూ సమానం కావు. మిమ్మల్ని నిజంగా అర్థం చేసుకునే ఇద్దరు ముగ్గురి సలహాను విలువైనదిగా తీసుకోండి. మిగతా శబ్దాన్ని తగ్గించండి.

వారంలో ఒక పనిని కేవలం మీ కోసం చేయండి. ఎవరికీ చూపించకుండా, పోస్ట్ చేయకుండా. పాట పాడడం, పుస్తకం చదవడం, ఏదైనా నేర్చుకోవడం. అది మీ ఆనందానికి మీరే మూలం కావడం నేర్పుతుంది.

ఒక జాగ్రత్త

స్వీయ బాధ్యత అంటే ఇతరుల మాటలను పూర్తిగా పట్టించుకోకపోవడం కాదు. సలహా వినాలి, విమర్శ నుంచి నేర్చుకోవాలి. కానీ తుది నిర్ణయం, దాని ఫలితం ఎప్పుడూ మన భుజాలపైనే ఉంటాయి.

మెప్పు కోసం జీవించేవారు ప్రతి చప్పట్లకూ బానిసలవుతారు. తన కోసం జీవించేవారు చప్పట్లు ఆగినా ముందుకు సాగుతారు. మీరు ఎవరి కోసం నడుస్తున్నారో ఈ రోజే నిర్ణయించుకోండి.




ఉదయం మన రోజుకు తొలి పుటలాంటిది. కళ్లు తెరవగానే ఫోన్ తీస్తే, ఇతరుల సందేశాలు మన ఆలోచనల్ని ఆక్రమించేస్తాయి. అలా కాకుండా మొదటి కొన్ని గంటలను మీకోసమే మీరు కేటాయించండి. ఆ సమయంలో కఠినమైన వ్యాయామం చేయండి, కొత్త విషయం నేర్చుకునేందుకు చదవండి, మీ ఆలోచనలను రాయండి. అన్నింటికన్నా కష్టమైన పనిని ముందే పూర్తి చేయండి. అప్పుడు మనసు తేలికవుతుంది, ఏకాగ్రత పెరుగుతుంది. రోజంతా మిగిలిన పనులు సులువుగా సాగుతాయి. ఉదయాన్ని గెలిచినవాడు రోజునూ గెలుస్తాడు.


-మహాదేవ

వింతల్లో వింతలు

బీన్‌ను కదిలిద్దాం!




అమెరికాలోని చికాగో మిలీనియం పార్క్‌లో వందల మంది గుమిగూడారు. లక్ష్యం ఏంటంటే, అక్కడి ప్రసిద్ధ 'క్లౌడ్ గేట్' (ది బీన్) శిల్పాన్ని ఏడంగుళాలు ఎడమవైపు నెట్టడం! లోపల ఒక మనిషి చిక్కుకున్నాడని, కింద తలుపు ఉందని, అతనికి ఊరగాయ ఇవ్వాలని నిర్వాహకుల సరదా సిద్ధాంతం. సుమారు 250 మంది ఒక్కసారి తోసినా శిల్పం ఇంచు కూడా కదల్లేదు. ఒక నిర్వాహకుడు మొదట "ఒక అంగుళం కదిలింది" అని ప్రకటించి, తర్వాత "అసలు కదల్లేదు" అని సరిదిద్దుకున్నాడు. కదలకపోయినా అందరూ నవ్వుతూ ఇంటికెళ్లారు.



ఇండోనేషియాలో దూసుకుపోతున్న 'రామాయణం'!

దర్శకుడు నితేష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన పౌరాణిక చిత్రం 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' ఇండోనేషియాలో దూసుకుపోతుంది. జకార్తాలో జరిగిన ఈ సినిమా ప్రీమియర్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. సాంప్రదాయ భారతీయ దుస్తులు ధరించి ప్రేక్షకులు థియేటర్ల వద్ద సందడి చేసిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు, థాయ్‌లాండ్‌లోనూ ఈ సినిమా జోరు కొనసాగుతోంది. అక్కడ విడుదలైన ఐదు రోజుల్లోనే రూ. 5.15 కోట్లకు పైగా వసూలు చేసి, ఒక భారతీయ చిత్రానికి సంబంధించి రికార్డు సృష్టించింది. బాక్సాఫీస్ రిపోర్టుల ప్రకారం, థాయ్‌లాండ్‌లో నవంబర్ 5న విడుదలైన ఈ చిత్రం సుమారు ฿550,000 (సుమారు రూ. 5.15 కోట్లు) రాబట్టింది. ఇక నవంబర్ 11న ఇండోనేషియాలోనూ ఈ చిత్రం ఘనంగా విడుదలైంది. జకార్తాలో జరిగిన ఈ ప్రీమియర్ షో సందర్భంగా అభిమానులు రెడ్ కార్పెట్ పై నడుస్తూ, గాజులు కొనుగోలు చేస్తూ, మెహందీ పెట్టుకుంటూ సందడి చేశారు. రాముడు, సీత, లక్ష్మణుడు, రావణాసురుల వేషధారణలో ఉన్న కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహర్షి వాల్మీకి రామాయణం, అద్భుత రామాయణం అలాగే తులసీదాస్ రచించిన రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణాసురుడిగా నటించారు. ఇండోనేషియాలో ప్రాచీన జావానీస్ అనువాదమైన 'ककविन् रामायणం' ద్వారా, అలాగే థాయ్‌లాండ్‌లో 'రామకీయెన్' రూపంలో ఈ ఇతిహాసానికి ఉన్న గాఢమైన సాంప్రదాయ సంబంధాల వల్ల ఇక్కడ ఈ చిత్రానికి విశేషమైన ఆదరణ లభిస్తోంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం దూసుకుపోతోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్లకు పైగా వసూలు చేసింది. భారతదేశంలో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైన ఈ చిత్రం, డొమెస్టిక్ మార్కెట్‌లో ఆరు రోజుల్లో రూ. 52.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ. 823.50 కోట్ల మార్క్‌ను దాటింది. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్, యశ్ యొక్క మాస్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో రవి దూబే లక్ష్మణుడిగా నటించారు. కాగా, ఈ చిత్రంలోని పోస్ట్-క్రెడిట్ సీన్‌తో పాటు, సన్నీ డియోల్ హనుమంతుడిగా పరిచయమయ్యే 'హనుమాన్ చాలీసా' మ్యూజిక్ వీడియోను కూడా చిత్ర యూనిట్ విడుదల చేసింది.

'దాదా'లో సింగర్‌గా మారిన బాలయ్య.. 'దాదా ధమాకా'లో నందమూరి నటసింహం స్పెషల్ ట్రీట్!



నందమూరి బాలకృష్ణ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. వరుస విజయాలతో జోరు మీదున్న బాలయ్య.. ఇప్పుడు తన తదుపరి చిత్రం 'దాదా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 24, 2026న క్రిస్మస్ కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో సినిమా నుంచి విడుదల కానున్న తొలి పాటకు సంబంధించిన ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో బాలకృష్ణ కేవలం నటించడమే కాకుండా తన గొంతును కూడా వినిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. 'దాదా' సినిమా నుంచి నవంబర్ 13, 2026న తొలి పాట 'దాదా ధమాకా' విడుదల కానుంది. టైటిల్‌కు తగ్గట్టుగానే ఈ పాటను ఫుల్ మాస్ ఎనర్జీతో రూపొందించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ పాటలో బాలకృష్ణ తనదైన స్టైల్‌లో స్టెప్పులు వేయనుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. బాలయ్యతో పాటు బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి కూడా ఈ పాటలో సందడి చేయనున్నారు. నోరా ఫతేహి తన అద్భుతమైన డ్యాన్స్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె డ్యాన్స్‌కు బాలయ్య మాస్ గ్రేస్ తోడైతే అభిమానులకు పండగే అని చెప్పాలి. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న పాట ఎలా ఉండబోతోందనే ఆసక్తి ఇప్పుడు అందరిలోనూ నెలకొంది. నవంబర్ 13న విడుదల కానున్న ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచే అవకాశం ఉంది. ఇక ఈ పాటకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. బాలకృష్ణ స్వయంగా కొన్ని లైన్స్ పాడారట. సాధారణంగా తనదైన నటన, డైలాగ్ డెలివరీ, మాస్ యాక్షన్‌తో ప్రేక్షకులను అలరించే బాలయ్య.. ఈసారి గాయకుడిగానూ అభిమానులను సర్‌ప్రైజ్ చేయబోతున్నారు. సినిమాలోని పాట కోసం ఆయన కొన్ని పంక్తులు ఆలపించగా, అవుట్‌పుట్ విషయంలో చిత్రబృందం సంతోషంగా ఉన్నట్లు సమాచారం.దీంతో బాలకృష్ణ గొంతులో వచ్చే ఆ ప్రత్యేకమైన లైన్స్ వినేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలోనూ పలువురు స్టార్ హీరోలు తమ సినిమాల్లో పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు బాలయ్య కూడా 'దాదా' కోసం తన గొంతును వినిపించనుండటం ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ముఖ్యంగా 'దాదా ధమాకా' పాటలో బాలయ్య పాడిన లైన్స్‌ను హైలైట్ చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పాట విడుదలైన తర్వాత ఈ అంశం అభిమానుల్లో మరింత చర్చనీయాంశమయ్యే అవకాశం ఉంది. !



మెగాస్టార్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్న వశిష్ఠ!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' గురించి గత కొంతకాలంగా రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. బింబిసార ఫేమ్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై మొదట్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే షూటింగ్, గ్రాఫిక్స్, ఇతర నిర్మాణానంతర కార్యక్రమాల కారణంగా సినిమా విడుదల ఆలస్యమవుతూ వస్తోంది. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత లేకపోవడంతో మెగా అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. చిత్రంలో నటిస్తున్న నటుడు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటోతో 'విశ్వంభర' పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో వెల్లడైంది. 'విశ్వంభర' సినిమా పరిస్థితి ఏమిటి? షూటింగ్ పూర్తయిందా? పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కడి వరకు వచ్చాయి? అనే సందేహాలు చాలాకాలంగా అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చేలా నటుడు ప్రవీణ్ కుమార్ తాజాగా డబ్బింగ్ సెషన్‌కు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో ఆయన ఈ సినిమాలో భాగమనే విషయం మరోసారి స్పష్టమైంది. అంతేకాకుండా సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఎలాంటి హడావుడి లేకుండా చిత్రబృందం సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. ముఖ్యంగా డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయనే విషయం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. అయితే సినిమా విడుదల తేదీపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా అందాల తార త్రిష కృష్ణన్ నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను అలరించడంతో 'విశ్వంభర'లో వీరి జంట ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్, ఆశికా రంగనాథ్, రమ్య పసుపులేటి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి సందూరి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు, భారీ తారాగణంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. 'బింబిసార' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వశిష్ఠ మల్లిడి.. ఇప్పుడు చిరంజీవితో 'విశ్వంభర' వంటి భారీ సోషియో ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా అద్భుతమైన ప్రపంచం, మాయాజాలం, ఫాంటసీ అంశాలు, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పాన్ ఇండియా హీరోగా శ్రీకాంత్ తనయుడు.. షూటింగ్ ప్రారంభం



పెళ్లిసందడి, ఛాంపియన్ మూవీస్‌తో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా. తాజాగా మరో మూవీకి సిద్ధమయ్యారు. రోషన్ హీరోగా భారీ సూపర్ హీరో అడ్వెంచరస్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్ బ్యానర్‌పై పాన్ ఇండియాస్థాయిలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించనున్నారు. తాజాగా ఈ భారీ అడ్వెంచరస్ మూవీ పూజా కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు శ్రీకాంత్ హాజరై ముహుర్తపు షాట్‌కు క్లాప్ కొట్టారు. ఈ చిత్రంలో రేఖా పాండే, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానుంది.

ఆ ఆలోచనలు ఒత్తిడి పెంచాయి: మౌళి తనూజ్ ప్రశాంత్

"నా తొలి చిత్రం 'లిటిల్ హార్ట్స్' మంచి విజయం సాధించింది. కానీ ఆ విజయం నాలో ఒత్తిడి పెంచింది. ఆ సినిమా విజయం తర్వాత నేను చాలా కథలు విన్నాను. అయితే సరైన కథలనే ఎంచుకుంటున్నానా? నా జడ్జ్‌మెంట్ కరెక్టేనా? అనే ఆలోచనలు నాలో ఒత్తిడి పెంచాయి. అయితే నాకు కొత్త కథలు చెబుతూనే, ఎంటర్‌టైనింగ్ సినిమాలు చేయాలని ఉంది" అని మౌళి తనూజ్ ప్రశాంత్ అన్నారు. మౌళి తనూజ్ ప్రశాంత్, సుష్మితా శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ సినిమా 'డీఎన్‌కే'. శ్రీను కంబాల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మౌళి తనూజ్ మాట్లాడుతూ-- "ఈజీ మనీకి అలవాటు పడ్డ ఓ కుర్రాడు గ్యాంబ్లింగ్ చేస్తే డబ్బులు వస్తాయని ఆ మార్గాన్ని ఎంచుకుంటాడు. కానీ అతను తీసుకునే నిర్ణయాల వల్ల అప్పుల్లో కూరుకుపోతాడు. ఆ అప్పుల నుంచి బయటపడటానికి ఒక దొంగతనం చేస్తాడు. ఆ తర్వాత ఆ కుర్రాడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది? ఆ కష్టాల నుంచి ఎలా బయటపడ్డాడు? అన్నదే ఈ సినిమా కథ. కథలో క్రైమ్ ఎలిమెంట్ ఉన్నప్పటికీ మంచి ఫన్ కూడా ఉంది. సెకండాఫ్‌లో ఒక సర్‌ప్రైజింగ్ సాంగ్ కూడా ఉంటుంది. సింజిత్ మంచి మ్యూ జిక్ ఇచ్చాడు. ఇక సెన్సార్ వాళ్లు అభ్యంతరం చెప్పడంతో మా సినిమా టైటిల్‌ను 'డీఎన్‌కే'గా మార్చాం. నాకు దర్శకత్వంపై ఆసక్తి ఉంది. కానీ ఇది పెద్ద బాధ్యత కాబట్టి కాస్త సమయం పడుతుంది" అని అన్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com